

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 15-06-2026 | సంపుటి - 29 | సంచిక -21 | రూ : 4 | పేజీలు: 8


## జలధార పనులు.. జూన్ డెడ్‌లైన్

### గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యత

- గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణకు అత్యంత ప్రాధాన్యం
- జూన్ నెలాఖరులోగా పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలన్న సీఎం చంద్రబాబు

2లో





## అప్రమత్తం చేసినా పట్టించుకోరా..?

- అధికారుల తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం
- హైదరాబాద్‌లో ఇటీవలి వర్షం ఇబ్బందులపై సమీక్ష
- మళ్లీ ట్రాఫిక్ స్తంభిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

హైదరాబాద్: ఇటీవల కురిసిన వర్షానికి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ అస్తవ్యస్తం కావడానికి దారితీసిన పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి పరిస్థితులు ఎదురైతే తట్టుకోవడానికి సిద్ధంగా ఉండాలని ముందుగానే సమీక్ష నిర్వహించి హెచ్చరించినప్పటికీ వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించిందన్నారు. వర్షం కురిసిన రోజు ఎవరెవరు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించారు.. ఎవరెవరు ఆఫీసుకే పరిమితం అయ్యారో విచారించి నివేదిక సమర్పించాలని డీజీపీ సీవీ ఆనంద్, సీఎస్ రామకృష్ణారావులను సీఎం ఆదేశించారు. వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి ఆదివారమిక్కడ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష

తరువాయి 2లో

### తాకితే సంగీత స్వరాలు..

## హంపి స్థూపాల మిస్టరీ వీడింది!

- హంపీ సంగీత స్తంభాల వెనుక అద్భుత ఇంజనీరింగ్ రహస్యం
- ఘనమైన గ్రానైట్ రాయితోనే సంగీత స్వరాలు వెలువడుతున్నాయని వెల్లడి
- స్తంభాల పొడవు, మందం ఆధారంగా స్వరాల తీవ్రతలో మార్పులు
- విజయనగర కాలంలో నృత్య ప్రదర్శనల కోసం నిర్మాణం
- పరిరక్షణ చర్యల్లో భాగంగా స్తంభాలను తాకడంపై నిషేధం

2లో



### మహారాష్ట్రలో విషాదం

## బావిలో పడ్డ పికప్ వ్యాన్, 8 మంది మృతి



- మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లాలో ఘోర ప్రమాదం
- ప్రయాణికులతో వెళ్తున్న పికప్ వ్యాన్ అదుపుతప్పి బావిలో పడిన వైనం
- ఈ దుర్ఘటనలో 8 మంది అక్కడికక్కడే మృతి
- ఘటనా స్థలంలో సహాయక చర్యలు
- ప్రమాదానికి గల కారణాలపై పోలీసుల దర్యాప్తు

## ఫ్రాన్స్‌లో మోదీ

### విల్లా కెర్లియోస్‌లో ప్రత్యేక భేటీ

- ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో పర్యటిస్తున్న ప్రధాని మోదీ
- 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమాన్ని ప్రారంభించిన మోదీ, మేక్రాన్
- దేశంలో స్టార్టప్ వ్యవస్థ మరింత విస్తరిస్తుందన్న మోదీ
- ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరపనున్న నేతలు

2లో



## నోయిడా ఎయిర్‌పోర్ట్

### చరిత్ర సృష్టించిన భూ నిర్వాసితులు




- నోయిడా విమానాశ్రయం నుంచి తొలి విమాన సర్వీసు ప్రారంభం
- భూములు ఇచ్చిన రైతులనే మొదటి ప్రయాణికులుగా పంపనున్న ప్రభుత్వం
- సోమవారం ఉదయం 8 గంటలకు లక్నోకు ఈ విమానం ప్రయాణం
- లక్నోలో రైతులతో ముచ్చటించనున్న సీఎం యోగి ఆదిత్యనాథ్
- ఇది చరిత్రాత్మక ఘట్టమని జేవార్ ఎమ్మెల్యే వ్యాఖ్య

2లో



### సర్‌పై ..

## అప్రమత్తత అవసరం

- కాంగ్రెస్ ఓట్లను తొలగించే ప్రమాదముంది
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2లో

# సర్‌పై అప్రమత్తత అవసరం

మంచిర్యాల : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) పట్ల కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ఆదివారం మంచిర్యాలలో నిర్వహించిన పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల(బీఎల్ఏ) శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. భాజపా ప్రభుత్వం సర్ పేరుతో ఓటరు జాబితా ప్రక్షాళన చేసేందుకు నిర్ణయించిందని...ఈ ప్రక్రియలో కాంగ్రెస్ ఓటర్ల పేర్లను తొలగించే ప్రమాదం పొంచి ఉందన్నారు. సోషల్ మీడియా పేరుతో భాజపా ప్రభుత్వం ఆధునిక ఏఐ సాంకేతికతను వినియోగించి పేరున్న నాయకుల నియోజకవర్గాల్లో ఓటర్లను భారీగా తొలగించే కుట్ర చేస్తున్నట్లు ఆరోపించారు. ఉదాహరణకు తన పేరు గాని, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పేరులో చిన్న తప్పు ఉన్నా ఓటరు జాబితాలో పక్కకు పెట్టే అవకాశం ఉందన్నారు. సరైన ధ్రువపత్రాలు సమర్పిస్తే పరిశీలించి జాబితాలో చేర్చుతారన్నారు. ఇలాంటి పరిస్థితిలో సాధారణ పౌరుడు ఓటు కోల్పోతే తిరిగి నమోదు చేసుకునేందుకు కష్టంగా ఉంటుందన్నారు.

ఓటరు జాబితాలో పేరు లేకుంటే దేశ పౌరసత్వం కోల్పోయే ప్రమాదముందని వ్యాఖ్యానించారు. సర్ సర్వే సమయంలో ఇళ్లకు తాళం వేసి ఉంటే జాబితాలో వారి పేర్లు తొలగించేలా కుట్రలు చేస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు ఇంటింటికి తిరిగి ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించకుండా చూడాలన్నారు. సింగరేణి కార్మికుల

**ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే క్షమించం..**

భారాస నేతలు సింగరేణి కార్మికుల శ్రమను, ఆత్మగౌరవాన్ని తక్కువ చేసి మాట్లాడితే క్షమించబోమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సింగరేణితోనే ముడిపడి ఉందని వ్యాఖ్యానించారు. ఆదివారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఉపరితల గనిని ఆయన మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్, సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాశ్ జ్యోతి, కలెక్టర్ కుమార్ దీపక్, స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతో కలిసి సందర్శించారు. ప్రజా ప్రభుత్వం నిజాలే చెబుతుందని..అందుకే ఈ ఓపెన్ హౌస్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంస్థను అన్ని రంగాల్లో కాపాడుకునేందుకు సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. భారాస నాయకులు తమ స్వార్థం కోసం కంపెనీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇతర పార్టీ నేతలు సొంత రాజకీయ ప్రయోజనాల కోసం సంస్థను వాడుకోవడం సరికాదన్నారు. కంపెనీలో ప్రతి అంశం పారదర్శకంగా జరుగుతుందని, అవకతవకలకు తావులేదన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, రీజియన్‌లోని జీఎంలు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

## తాకితే సంగీత స్వరాలు...
# హంపి స్థూపాల మిస్టరీ వీడింది!

కర్ణాటకలోని ప్రపంచ ప్రఖ్యాత హంపిలో ఉన్న 15వ శతాబ్దానికి చెందిన విఠల ఆలయం అనేక అద్భుతాలకు నెలవు. అందులో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది సంగీత స్తంభాల గురించి. గట్టి గ్రానైట్ రాళ్లతో నిర్మించిన ఈ స్తంభాలను మెల్లగా తాకినప్పుడు, అవి స్పష్టమైన సంగీత స్వరాలను ఎలా పలికిస్తాయనేది శతాబ్దాలుగా అంతుచిక్కని రహస్యం. అయితే, ఆధునిక శాస్త్రీయ విశ్లేషణలు ఈ పురాతన ధ్వని ఇంజనీరింగ్ అద్భుతం వెనుక ఉన్న రహస్యాన్ని ఛేదించాయి. విజయనగర సామ్రాజ్య కాలంలో నిర్మించిన ఈ ఆలయం యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందింది. ఇక్కడి మహామండపంలో ఉన్న ఒక్కో ప్రధాన స్తంభం చుట్టూ, అదే రాతి నుంచి చెక్కిన అనేక చిన్న స్తంభాలు ఉంటాయి. వీటిని సమిష్టిగా "సరిగమ స్తంభాలు" అని పిలుస్తారు. ఒకప్పుడు ఈ ప్రాంగణంలో నృత్యకారులు నాట్యం చేస్తుండగా, ఈ స్తంభాలను తాకుతూ లయకు అనుగుణంగా శబ్దాలు సృష్టించేవారని చరిత్రకారులు చెబుతారు. ఈ స్తంభాలు ప్రాచీన భారతీయ గ్రంథమైన 'నాట్య శాస్త్రం'లో' పేర్కొన్న 'ఘన వాద్య' వర్గానికి చెందినవి. ఈ స్తంభాల నిర్మాణంపై ఎన్నో ఊహాగానాలు ఉండేవి. లోపల ఖాళీగా ఉంచడం వల్ల లేదా లోహపు కడ్డీలు అమర్చడం వల్ల శబ్దం వస్తుందని భావించేవారు. కానీ, కల్పక్కంలోని ఇందిరా గాంధీ అటామిక్ రీసెర్చ్ సెంటర్ (IGCAR) మెటలర్జీ శాస్త్రవేత్తలు 2008లో చేసిన ఒక కీలక అధ్యయనం ఈ వాదనలను తోసిపుచ్చింది. వారు స్తంభాలకు ఎలాంటి హాని కలగకుండా అల్ట్రాసోనిక్ టెస్టింగ్, ఇంపాక్ట్‌ఎకో వంటి నాన్ డిస్ట్రక్టివ్ పద్ధతులను ఉపయోగించి పరిశోధనలు చేశారు. ఈ పరిశోధనలో స్తంభాలు పూర్తిగా గట్టి గ్రానైట్‌తోనే నిర్మించబడ్డాయని స్పష్టమైంది. అత్యంత సాంద్రత కలిగిన ఈ గ్రానైట్ రాతిలో శబ్దం సెకనుకు 4,800 నుంచి 5,500 మీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. స్తంభం పొడవు, మందం, ఆకృతి ఆధారంగా అది వెలువరించే సంగీత స్వరం ఆధారపడి ఉంటుంది. పొట్టిగా, మందంగా ఉన్న స్తంభాలు హెచ్చు స్వరాలను, పొడవుగా, సన్నగా ఉన్నవి తక్కువ స్వరాలను ఉత్పత్తి చేస్తాయి. ట్యూనింగ్ ఫోర్క్ వలె ఇవి ప్రక్కలకు వంగడం ద్వారా కంపించి , ప్రతిధ్వనిని సృష్టిస్తాయి. రాతిలోని మైక్రోక్రిస్టలైన్ నిర్మాణం ఈ కంపనాలను ఎక్కువసేపు నిలిపి ఉంచడంలో సహాయపడుతుంది. అయితే, కొన్ని స్తంభాలలో ఏర్పడిన పగుళ్ల కారణంగా వాటిలో శబ్ద వేగం తగ్గిపోయి, ప్రస్తుతం అవి శబ్దాలను ఉత్పత్తి చేయడం లేదు. ఈ అపురూప వారసత్వ సంపదను కాపాడేందుకు, విజయనగర పతనం తర్వాత దెబ్బతిన్న ఈ నిర్మాణాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు, ప్రస్తుతం సందర్శకులను ఈ స్తంభాలను తాకడానికి అనుమతించడం లేదు.

## జలధార పనులు.. జూన్ డెడ్లైన్..
# గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యత

జలధార జలహారతి కార్యక్రమంలో భాగంగా గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధి పనులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. 2026 జూన్ నెలాఖరు నాటికి పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ పూర్తి చేయాలని ఆయన స్పష్టమైన గడువును నిర్దేశించారు. శనివారం జలవనరుల శాఖ, పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలతో మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, సీఎంఓ కార్యదర్శి రాజమౌళి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు తన క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్నారు. జలహారతి పురోగతిపై జిల్లా కలెక్టర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ పథకం కింద ఉపాధి హామీ (MGNREGS) నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. పనుల అమలులో ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని ఆయన హెచ్చరించారు. నీటి మిగులు ఉన్న బేసిన్లను, నీటి కొరత ఉన్న ప్రాంతాలతో అనుసంధానించే ప్రాజెక్టులను చేపట్టాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. చెక్ డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు, పంట కుంటల పునరుద్ధరణ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. వాల్మీకిపురం వాగు అభివృద్ధి వంటి విజయవంతమైన నమూనాలను ఇతర ప్రాంతాల్లోనూ అమలు చేయాలని సూచించారు. మొదటి దశలో పునరుద్ధరించిన ఆస్తుల నాణ్యతను పరిశీలించాలని, వరద నివారణకు కాలువల్లోని అడ్డంకులను తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా భూగర్భ జలాల రీఛార్జ్, పర్యావరణ ప్రయోజనాలపై జిల్లాల వారీగా అంచనాలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఈ నీటి సంరక్షణ యజ్ఞంలో ప్రజలు, రైతులు, నీటి వినియోగదారుల సంఘాలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

# మహారాష్ట్రలో విషాదం బావిలో పడ్డ పికప్ వ్యాన్, 8 మంది మృతి

మహారాష్ట్రలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. షోలాపూర్ జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న ఓ పికప్ వ్యాన్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 8 మంది మృతి చెందినట్లు పోలీసులు ఆదివారం వెల్లడించారు. మృతుల్లో నలుగురు మహిళలు, నలుగురు చిన్నారులు ఉన్నారు. పోలీసులు అందించిన ప్రాథమిక వివరాల ప్రకారం, మృతులంతా పండరీపూర్ తాలూకా రంజని గ్రామానికి చెందిన సాగర్ చౌగులే కుటుంబ సభ్యులు, బంధువులుగా గుర్తించారు. వీరంతా మాల్వాడ్‌లోని ఆలయంలో దర్శనం పూర్తిచేసుకుని తిరిగి తమ స్వగ్రామానికి వెళుతుండగా మాల్వాడ్‌పండరీపూర్ మార్గంలో ఈ విషాదం జరిగింది. తాందూల్వాడి సమీపంలోకి రాగానే వాహనం అదుపుతప్పి బావిలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన బావికి ఎలాంటి రక్షణ గోడ లేకపోవడమే ఇంతటి ఘోరానికి ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై ఎన్‌సీపీ (శరద్ పవార్) ఎమ్మెల్యే రోహిత్ పవార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే సహాయం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా పర్యవేక్షక మంత్రి జయకుమార్ గోర్ మాట్లాడుతూ.. బావికి రక్షణ గోడ లేకపోవడంపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానిక యంత్రాంగం సహాయక చర్యలను పర్యవేక్షిస్తోంది.

## నోయిడా ఎయిర్‌పోర్ట్
# చరిత్ర సృష్టించిన భూ నిర్వాసితులు

ఉత్తరప్రదేశ్‌లో నూతనంగా నిర్మించిన నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయంలో ఒక చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం తమ వేలాది ఎకరాల భూములను త్యాగం చేసిన రైతులే ఈ విమానాశ్రయం నుంచి బయలుదేరే తొలి విమానంలో ప్రయాణించనున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు నోయిడాలోని జేవార్ నుంచి లక్నోకు ఈ విమానం బయలుదేరనుంది. ఈ చారిత్రక విమాన ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా జేవార్ ఎమ్మెల్యే ధీరేంద్ర సింగ్ మాట్లాడుతూ, "బహుశా చరిత్రలో ఇలా జరగడం ఇదే మొదటిసారి. విమానాశ్రయం కోసం భూములు ఇచ్చిన రైతులే అందులోంచి బయలుదేరే తొలి విమానంలో ప్రయాణికులు కాబోతున్నారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దార్శనికతతో రైతుల కలలు నెరవేరాయి" అని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం భూములు ఇచ్చిన రైతులతో కలిసి తాను కూడా ఈ విమానంలో ప్రయాణిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రయాణిస్తున్న రైతులలో మహిళలు, భూమి ఇవ్వకపోయినా విమానాశ్రయ నిర్మాణం వల్ల నిర్వాసితులైన వారు కూడా ఉన్నారని ఎమ్మెల్యే వివరించారు. లక్నో చేరుకున్న తర్వాత ఈ రైతులందరూ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో ముచ్చటిస్తారు. "సామాన్యుడు కూడా విమానమెక్కాలన్నది ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం యోగి ఆదిత్యనాథ్ కల. అది రేపు జేవార్ నుంచి నెరవేరబోతోంది" అని ధీరేంద్ర సింగ్ పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి 28న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. 'వికసిత ఉత్తరప్రదేశ్'కు ఈ విమానాశ్రయం ఒక చిహ్నంగా నిలుస్తుందని ఆనాడు ప్రధాని వ్యాఖ్యానించారు.

## రాజ్ ఠాక్రే పుట్టినరోజు కానుక..
# ముంబైలో టూవీలర్లకు పెట్రోల్‌పై రూ.5 తగ్గింపు

- **రాజ్ ఠాక్రే పుట్టినరోజు సందర్భంగా మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన ప్రత్యేక కార్యక్రమం**
- **ముంబైలో ద్విచక్ర వాహనదారులకు పెట్రోల్‌పై లీటర్‌కు రూ.5 తగ్గింపు**
- **నగరం వ్యాప్తంగా ఎంపిక చేసిన 36 పెట్రోల్ బంకుల్లో ఈ కార్యక్రమం అమలు**
- **పెరుగుతున్న ధరల నుంచి సామాన్యులకు ఉపశమనం కోసమే ఈ చర్య అని ప్రకటన**
- **ఇంధన ధరల పెరుగుదలపై కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించిన ఎంఎన్ఎస్ నేతలు**




పెరుగుతున్న ఇంధన ధరలతో సతమతమవుతున్న సామాన్య వాహనదారులకు ఉపశమనం కల్పించే దిశగా మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పార్టీ అధినేత రాజ్ ఠాక్రే పుట్టినరోజు సందర్భంగా ముంబైలోని ద్విచక్ర వాహనదారులకు పెట్రోల్‌పై ప్రత్యేక తగ్గింపును ప్రకటించింది. ఈ పథకం కింద నగరంలోని ఎంపిక చేసిన 36 పెట్రోల్ బంకుల్లో టూవీలర్లకు లీటర్ పెట్రోల్‌పై రూ.5 తగ్గింపును అందిస్తోంది. రాజ్ థాకరే పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ఒక్కరోజు పాటు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. దేశంలో ద్రవ్యోల్బణం, ఇంధన ధరలు నిరంతరం పెరుగుతూ సామాన్యుల బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్న తరుణంలో ఎంఎన్ఎస్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కార్యక్రమం ద్వారా సామాన్యులపై పడుతున్న ఆర్థిక భారాన్ని కొంతమేర తగ్గించడమే తమ లక్ష్యమని వారు స్పష్టం చేశారు. ఈ చొరవపై ఎంఎన్ఎస్ డివిజన్ ప్రెసిడెంట్ జై శృంగార్‌పురే మాట్లాడుతూ.. "ప్రస్తుతం దేశంలో పరిస్థితులు చాలా కష్టంగా ఉన్నాయి. ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగింది, పెట్రోల్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇలాంటి సమయంలో మా వంతుగా ప్రజలకు కొంత మద్దతు ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టాం" అని వివరించారు. మరో ఎంఎన్ఎస్ నేత సందీప్ దేశ్‌పాండే ఇంధన ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం విషయంలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పెట్రోల్ ధరల భారాన్ని అంతిమంగా ప్రజలే మోస్తున్నారని, వినియోగదారులపై ఒత్తిడి తగ్గించడానికి ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అమెరికా డాలర్ విలువలో హెచ్చుతగ్గులు కూడా ఇంధన ధరలపై ప్రభావం చూపుతున్నాయని, ద్రవ్యోల్బణంతో ఇబ్బంది పడుతున్న పౌరులకు ప్రభుత్వాలు అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. గతంలో కూడా ఇంధన ధరల పెంపు, ద్రవ్యోల్బణంపై ఎంఎన్ఎస్ పలుమార్లు ఆందోళన వ్యక్తం చేసింది. ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. ఈ తాజా కార్యక్రమం ద్వారా ముంబై వాసులకు తక్షణ ఊరట లభిస్తుందని, రోజువారీ ఖర్చుల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తుందని పార్టీ నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఫ్రాన్స్‌లో మోదీ విల్లా కెర్లియోస్లో ప్రత్యేక భేటీ

ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఆదివారం ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో ఉన్న చారిత్రక 'విల్లా కెర్లియోస్'ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు తేలికపాటి సంభాషణలో మునిగిపోయారు. విల్లాను కలియతిరుగుతూ ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. విల్లా కెరిలోస్ అనేది 20వ శతాబ్దం ప్రారంభంలో నిర్మించిన ఒక అసాధారణమైన హౌస్ మ్యూజియం. క్రీస్తుపూర్వం 2వ శతాబ్దానికి చెందిన ఒక ప్రాచీన గ్రీకు ఉన్నత కుటుంబ నివాసాన్ని నమూనాగా తీసుకుని, ఎంతో నిశితంగా ఆధునిక కాలంలో దీన్ని పునఃసృష్టించారు. ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ రివేరా తీరంలో, నైస్ మరియు మొనాకో నగరాల మధ్య ఉన్న బ్యూలీ సర్‌మెర్ అనే ప్రాంతంలో ఈ విల్లా ఉంది. మధ్యధరా సముద్రానికి అభిముఖంగా ఒక రాతి ద్వీపకల్పంపై కొలువై ఉన్న ఈ భవనం, ప్రస్తుతం చారిత్రక కట్టడంగా వర్గీకరించబడింది. దీని యాజమాన్య హక్కులను 'ఇన్‌స్టిట్యూట్ డి ఫ్రాన్స్' కలిగి ఉంది. అంతకుముందు, నీస్‌లో జరిగిన 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమాన్ని మోదీ, మేక్రాన్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. భారత్‌లో సంస్కరణల వేగం తగ్గబోదని స్పష్టం చేశారు. దేశంలోని స్టార్టప్ వ్యవస్థ మరింత విస్తరణకు సిద్ధంగా ఉందన్నారు. గత 11-12 ఏళ్లలో బలమైన ఆవిష్కరణల వ్యవస్థను నిర్మించుకున్నామని, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా భారత్ అవతరించిందని గుర్తు చేశారు. ప్రపంచ సవాళ్లకు సాంకేతిక పరిష్కారాలు అభివృద్ధి చేసేందుకు తమతో కలిసి పనిచేయాలని ప్రపంచ ఆవిష్కర్తలను ఆయన ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరుకావడం ఫ్రాన్స్‌కు ఎంతో గౌరవకారణమని అధ్యక్షుడు మేక్రాన్ అన్నారు. భారత నేతగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్నందుకు మోదీని అభినందించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ పాత్రను ఆయన ప్రశంసించారు. అధ్యక్షుడు మేక్రాన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ శనివారం ఫ్రాన్స్ చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఇరు నేతలు ద్వైపాక్షిక సంబంధాలపై సమీక్ష జరపనున్నారు. ఈ కార్యక్రమానికి ముందు మోదీ పలువురు ఇన్వెస్టర్లు, వెంచర్ క్యాపిటల్ అధిపతులతో కూడా సమావేశమయ్యారు.

# అప్రమత్తం చేసినా పట్టించుకోరా..?

హైదరాబాద్: ఇటీవల కురిసిన వర్షానికి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ అస్తవ్యస్తం కావడానికి దారితీసిన పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి పరిస్థితులు ఎదురైతే తట్టుకోవడానికి సిద్ధంగా ఉండాలని ముందుగానే సమీక్ష నిర్వహించి హెచ్చరించినప్పటికీ వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించిందన్నారు. వర్షం కురిసిన రోజు ఎవరెవరు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించారు.. ఎవరెవరు ఆఫీసుకే పరిమితం అయ్యారో విచారించి నివేదిక సమర్పించాలని డీజీపీ సీవీ ఆనంద్, సీఎస్ రామకృష్ణారావులను సీఎం ఆదేశించారు. వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి ఆదివారమిక్కడ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

**1వ తేదీనే సమీక్ష నిర్వహించినా..**

ఈ నెల 9న వర్షం కురిసినప్పుడు సైబరాబాద్ ప్రాంతంతోపాటు అనేక చోట్ల ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారని.. పోలీసు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయలేదని సీఎం పేర్కొన్నారు. వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ఆయా శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తం కాలేదన్నారు. వర్షాకాలంలో ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నం అవుతాయని ఊహించే ఈ నెల 1వ తేదీన నిర్వహించిన సమావేశంలో అప్రమత్తం చేశానని.. అయినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆ రోజు సీనియర్ అధికారులు సహా ఎవరెవరు రోడ్లపైకి వచ్చి సహాయక చర్యల్లో పాల్గొన్నారు..? ఎవరెవరు రాలేదన్న దానిపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని.. మరోసారి ఇలాంటి పరిస్థితి తలెత్తితే కఠిన చర్యలు తీసుకోవాలని సీఎస్, డీజీపీలకు ఆదేశాలు జారీ చేశారు. అలాంటి సందర్భాల్లో అన్ని ప్రభుత్వ శాఖలు కలిసి పనిచేయాలని.. మున్సిపల్, హైడ్రా, ట్రాఫిక్, జలమండలితోపాటు పోలీసులు కూడా క్షేత్రస్థాయిలో ఉండాల్సిందేనని.. అవసరమైతే తాను కూడా వస్తానన్నారు. వర్షం కురిసినప్పుడు నీరు నిలిచే ప్రాంతాలు, ట్రాఫిక్ స్తంభించే ప్రాంతాల డేటా ఆధారంగా పనిచేయాలని.. విద్యుత్ శాఖ పూర్తిగా సన్నద్ధం కావాలన్నారు. ఇకపై వర్షం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తితే కఠిన చర్యలు తీసుకుంటామని.. మానవ తప్పిదాలతో సమస్యలు ఉత్పన్నమైతే సహించనని హెచ్చరించారు. ట్రాఫిక్ విభాగంలో తక్షణమే ఖాళీలు భర్తీ చేయాలని సీఎం ఆదేశించారు. చెట్లు కూలడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంపైనా ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి సమయాల్లో విద్యుత్ పునరుద్ధరణ వెంటనే జరగాలని, అవసరమైతే మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ

*** బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. ఆదివారం సిఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధి బాచుపల్లి 18వ డివిజన్ నందనవనం కాలనీ ఫార్చున్ గేట్స్, ఫోర్ పిల్లర్ హోమ్స్ కాలనీవాసులు కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి నందనవనం కాలనీ ఫార్చ్యూన్ గేట్స్ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టినందుకుగాను సంక్షేమ సంఘం సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఏర్పాటు అవుతున్న కాలనీలలో మౌలిక వసతులు కల్పించడమే తన మొదటి ప్రాధాన్యతనని అన్నారు. రానున్న రోజుల్లో నందనవనం కాలనీ ఫార్చ్యూన్ గేట్స్ కాలనీ లొ మౌలిక వసతుల కల్పనతో పాటు ఫోర్ పిల్లర్స్ హోమ్స్ (పంచవటి కాలనీ) లో త్రాగునీటి సౌకర్యాన్ని కల్పిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, నాయకులు ప్రదీప్ కుమార్ తాళ్లూరి, కాలనీవాసులు సునీల్, మోహన్, జగదీష్, ఫణీంద్ర, సురేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మర్రి లక్ష్మణ్ రెడ్డి అరుంధతి రెడ్డిల 60వ వివాహ వార్షికోత్సవ వేడుకలు



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : ప్రముఖ విద్యావేత్త, వెటర్న్ అథ్లెట్ మర్రి లక్ష్మణ్ రెడ్డి అరుంధతి రెడ్డి 60వ వివాహ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మేడ్చల్ లోని "ఒనవ కన్వెన్షన్" లొ నిర్వహించిన ఈ వేడుకలకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ , ఎమ్మెల్సీ శంభీ పూర్ రాజు , ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి , మర్రి రాజశేఖర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, బండారి లక్ష్మారెడ్డి, డాక్టర్ సంజయ్ లు హాజరై వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం అంటే ప్రాణదానం" : గ్రామ అభివృద్ధి కమిటీ



లింగాల ఘణపురం/జనగామ, ప్రజా స్ఫూర్తి : ప్రపంచ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని లింగా ల ఘణపురం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ పంచాయతీ పాలక మండలి, గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా కేంద్రం లో ని ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తం కొరత ఉన్న నేపథ్యంలో,అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి సహాయపడాలనే సామాజిక బాధ్యతతో గ్రామ యు వత, ప్రజలు, ప్రముఖులు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ వైద్య బృందం గ్రామం లోని రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించింది.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, రక్తదానం చేయడం ద్వా రా ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు జీవం పోయవచ్చని, రక్తదాతలకు అవ సరమైన సమయంలో బ్లడ్ బ్యాంక్ ద్వా రా రక్తం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎడ్ల లావణ్య రాజు, ఉప సర్పంచ్ గట్టగళ్ల పెద్ద రాజయ్య, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బోయిని రమేష్, బ్లడ్ డొనేషన్ క్యాంప్ మెడికల్ ఆఫీసర్ ఎం.దివ్య, వైద్య బృందం, సామాజిక కార్యకర్తలు చెన్నూరి మల్లేశం, రాగ ళ్ల ఉపేందర్,వి.డి.సి ఉపాధ్యక్షు లు కుంటి రామచందర్, ఆకుల రవి, బెజ్జం అశోక్, వార్డు సభ్యులు, గ్రామ ప్రముఖులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేపట్టాలి

*** వ్యవసాయ శాఖ అధికారి బాబురావు**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారి బాబురావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో జూన్ 8వ తేదీ నాటికి నైరుతి రుతుపవనాలు పూర్తిగా విస్తరించడంతో రానున్న రోజుల్లో సాధారణం నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. వర్షాధార పంటల సాగుకు అనుకూల పరిస్థితులు నెలకొన్నందున రైతులు పత్తి, సోయాబీన్, మొక్కజొన్న, జొన్న, కంది, పెసర, మినుము, ఆముదం వంటి పంటల సాగుకు సిద్ధం కావాలని సూచించారు. విత్తనాల ఎంపికలో ధృవీకరించబడిన, నాణ్యమైన విత్తనాలను మాత్రమే ఉపయోగించాలని కోరారు. పొలాల్లో అధిక తేమ లేకుండా నీరు నిల్వ కాకుండా కాలువలు ఏర్పాటు చేయాలని, నేలలో తగిన తేమ ఉన్నప్పుడే విత్తనాలు వేయాలని సూచించారు. చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరులను శుభ్రపరచి వర్షపు నీటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడరాదని, పశువులను కూడా అక్కడ ఉంచరాదని రైతులకు హెచ్చరించారు. వాతావరణ శాఖ జారీ చేసే సూచనలు, హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకుని సాగు పనులు చేపట్టాలని రైతులకు వ్యవసాయ శాఖ అధికారి బాబురావు విజ్ఞప్తి చేశారు.

## భగత్సింగ్ నగర్ లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి

*** ఎమ్మెల్యే కె.పి.వివేకానందుకు కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు వినతి**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : చింతల్ డివిజన్ పరిధి భగత్సింగ్ నగర్ లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ను వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ నగర్ కాలనీ లో మంజీర నీరు లోప్రెషర్ తో రావడం వలన కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యపై కాలనిలో పెండింగులో ఉన్న మెయిన్ రోడ్డు ప్రధాన రహదారి, స్టార్ అపార్ట్మెంట్ నుండి ముస్లిం మసీదు వరకు పెండింగ్ లో ఉన్న సీసీ రోడ్డు పనులను మొదలు పెట్టాలని, కొన్ని వీధులలో కరెంటుకు అంతరాయం కలుగుతుంది త్రీఫేస్ కనెక్షన్ ఇప్పించాలని, శిథిలమైన పాత స్తంభాల స్థలంలో నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతూ కాలనీ లో ఉన్న కొన్ని ముఖ్యమైన విషయాలు కూడా చర్చించారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వాటర్ వర్క్స్ జీఎం తో ఫోన్లో మాట్లాడి వెంటనే నూతన జంక్షన్ ఏర్పాటు చేసి మంచి ప్రెషర్ తో నీరు సరఫరా అయ్యేలా చూడాలని ఆదేశించారు. కాలనిలో సీసీ రోడ్డు వేయాలని జిహెచ్ఎంసి ఈఈ ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం కాలనీ అధ్యక్షుడు పచ్చిమట్ల నరేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎస్ ప్రతాపరెడ్డి, ఈ వెంకట్ రెడ్డి (కేసీఆర్ ), బీసు వెంకటేశం గౌడ్, ఎం నరసింహ, టైలర్ మల్లేష్, గడ్డం రాము, జితేందర్ రెడ్డి, పుండరీకం, సాయి, కే నాగరాజు, మల్లేష్, నాగరాజు, ప్రదీప్ రెడ్డి, మల్లేష్, టీ నాగరాజు, సదాల రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధికి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాటుపడాలి

*** బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : కాలనీ అభివృద్ధికి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాటుపడాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ డివిజన్ బాపునగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సభ్యులు పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ అభివృద్ధిలో బాపునగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సభ్యులకు నా సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. గత 12 ఏళ్ల కాలంలో అనేక నిధులు వెచ్చించి కుత్బుల్లాపూర్ డివిజన్లోని అన్ని కాలనీలలో మౌలిక వసతులు కల్పించామని, రానున్న రోజుల్లో కూడా మరింత అభివృద్ధి పరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నూతన వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పి. జగదీష్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్. దయానంద్, ఉపాధ్యక్షులు మాల్యాద్రి, బాబురావు, కె.వి. రాజేష్, సంయుక్త కార్యదర్శిలు రాజారెడ్డి, రాజు యాదవ్, దత్తాత్రేయ, ఎల్వివి రామాంజనేయులు, జైపాల్ రెడ్డి, కోశాధికారి మధుసూదన్, కార్యనిర్వాహక కార్యదర్శిలు శ్రీధర్ కుమార్, రవి, లక్ష్మీనారాయణ గౌడ్, సభ్యులు సత్తిబాబు, శ్రీరామచంద్రమూర్తి, కె.వి. రాజేంద్రప్రసాద్, కె. నరేష్, శ్రీరామ్, సంపత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కుంటాలలో ఎఫ్ సి ఐ గోదాము ఏర్పాటు చేయాలని వినతి



ప్రజాస్ఫూర్తి, బైంసా: తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్పర్సన్ డీకే అరుణను హైదరాబాద్లో కలిసిన బీజేపీ జిల్లా నాయకుడు జీవీ రమణారావు, కుంటాల మండలంలో ఎఫ్సీఐ గోదాము నిర్మాణానికి వినతిపత్రం అందజేశారు. మండలంలో పంటల నిల్వకు గోదాములు లేక రైతులు పడుతున్న ఇబ్బందులను ఆయన వివరించారు. బీజేపీ జిల్లా నాయకుడు,మాజీ ఎంపీపీ జీవీ రమణారావు తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్పర్సన్ డీకే అరుణను కలిసి, కుంటాల మండలంలో భారత ఆహార సంస్థ (ఎఫ్సీఐ) గోదామును నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుంటాల మండలంలో రైతులు ఏటా పెద్ద మొత్తంలో మొక్కజొన్న, వరి, ఇతర పంటలను సాగు చేస్తున్నారని తెలిపారు. అయితే, పండిన పంటలను నిల్వ చేసుకోవడానికి మండలంలో తగినన్ని గోదాములు అందుబాటులో లేవని, దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు, ఎదుర్కొంటున్నారని రమణారావు వివరించారు. నిల్వ సౌకర్యాలు లేకపోవడం వల్ల, పంటకు సరైన గిట్టుబాటు ధర రాకముందే రైతులు తమ ఉత్పత్తులను విక్రయించాల్సిన దుస్థితి ఏర్పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కుంటాల మండల కేంద్రంలో ఒక ఎఫ్సీఐ గోదామును ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని రమణారావు పేర్కొన్నారు.దీనివల్ల రైతులు తమ పంటలను సురక్షితంగా నిల్వ చేసుకొని, మార్కెట్ ధరలకు అనుగుణంగా విక్రయించుకునే అవకాశం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. వినతిపత్రాన్ని స్వీకరించిన డీకే అరుణ,ఈ అంశంపై సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. రైతుల ప్రయోజనాలను పరిరక్షించే దిశగా, అవసరమైన చర్యలు తీసుకోవడానికి కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో సదాశివ్ పటేల్తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా పిడె రేటెడ్ చెస్ పోటీలలో కల్నల్ సంతోష్ బాబు పాల్గొనాలి

*** జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గండూరి క్రపాకర్**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: జూలై 11,12వ తేదీలలో హైదరాబాదులోని నిజాంపేట్ రోడ్డు బాచుపల్లి లో ఎల్ ఎ స్ కె చెస్ అకాడమి, తెలంగాణ స్టేట్ చెస్ అసోసియేషన్ , ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే మహా వీర చక్ర కల్నల్ సంతోష్ బాబు ఆల్ ఇండియా ఓపెన్ ఫీడ్ రేటెడ్ రాపిడ్ చెస్ టోర్నమెంట్ లో ఆసక్తిగల విద్యార్థులు పాల్గొని బహుమతులు గెలుపొందాలని సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గండూరి కృపాకర్ అన్నారు. ఆదివారం సూర్యాపేటలోని టి టి డి కళ్యాణ మండపం లో కల్నల్ సంతోష్ బాబు ఫిడె చెస్ ఛాంపియన్షిప్ పోటీలను సూర్యాపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో తాము నిర్వహించే చెస్ పోటీలలో పాల్గొని చాలామంది విద్యార్థులు ఇతర ప్రాంతాలలో జరిగే చెస్ పోటీలలో విజేతలుగా నిలుస్తున్నారని అన్నారు. ఆదివారం జరిగిన చెస్ పోటీలలో గెలుపొందిన విజేతలు ఇందిర, రవికుమార్, దీక్షిత్, జతిన్ రెడ్డి, అఖిలేష్, చిద్విలాసిని లకు ఆయన బహుమతులు అందించారు. ఈకార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ కార్యదర్శి సంతోష్, ట్రెజరర్ వెంకట మురళి, ఉపాధ్యక్షులు సాయికుమార్, జాయింట్ సెక్రెటరీ లింగా రెడ్డి , ఆర్గనైజర్ కోచ్ శ్రీనివాస రాజు, మనోజ్ రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి సకాలంలో హాజరు కావాలి: కలెక్టర్

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో, కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## కాలనీలలో మౌలిక వసతులను కల్పించేలా కృషి చేస్తా

*** బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని కాలనీలలో మౌలిక వసతులను కల్పించేలా కృషి చేస్తానని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. ఆదివారం సిఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధి ప్రగతి నగర్ లోని జిపిఆర్ లేఔట్ కాలనీవాసులు కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు వంటి మౌలిక వసతులను కల్పించాలని విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని కాలనీలలో మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వై.ఎస్, కాలనీవాసులు రమణారెడ్డి, శ్యామ్ సింగ్, శివ నాగరాజు, వెంకట దుర్గాప్రసాద్, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులకు అండగా ఉంటాను

*** మాజి మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేటలో ఆర్యవైశ్యులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారికి ఏ సమస్య వున్నా తనను కలవవచ్చని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు ఆధ్వర్యంలో పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో వ్యాపార అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయని, వ్యాపార రంగంలో సూర్యాపేట వేగంగా విస్తరిస్తుందని ఈ విస్తరణలో ఆర్యవైశ్యులు కీలకపాత్ర పోషించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు ఉప్పల ఆనంద్,బండారు రాజా, చల్లా లక్ష్మీకాంత్, బొమ్మిడి అశోక్, బిక్కుమళ్ల కృష్ణ, మిట్టపల్లి రమేష్, ఉప్పల శ్రవణ్, పసుపర్తి కృష్ణమూర్తి, బొల్లం సురేష్, కందిబండ ఉమామహేశ్వర రావు, సోమ ప్రవీణ్, సోమ వెంకటేశ్వర్లు, దోగుపర్తి ప్రవీణ్, బెలిదె అంజయ్య, గోపారపు రాజు, కుంచపర్తి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

## పోలీసుల అప్రమత్తత.. గంజాయి రవాణా యత్నం భగ్నం



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా కేంద్రం లోని బస్టాండ్ పరిసర ప్రాంతంలో పోలీసు లు అప్రమత్తంగా వ్యవహరించి గంజా యి అక్రమ రవాణా యత్నాన్ని భగ్నం చేశారు. ప్రత్యేక తనిఖీల సందర్భంగా 2.9 కిలోల గంజాయిని స్వాధీనం చేసు కుని ముగ్గురు నిందితులను అరెస్ట్ చే శారు. సీఐ సత్యనారాయణ రెడ్డి ఆదే శాల మేరకు ఎస్ఐ రతీష్, కానిస్టేబుళ్లు సాగర్, రమేష్, నరేష్, ప్రణయ్, మహేం దర్‌లు వాహనాలు,అనుమానిత వ్యక్తు లపై తనిఖీలు నిర్వహించారు.ఈ క్రమం లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను తనిఖీ చేయగా వారి వద్ద నుంచి గంజాయి లభ్యమైంది. పట్టుబడిన నిందితులు మిసాల శ్యా మ్, కాశిబోయిన గౌతమ్, గుండా కార్తీక్ గా గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తె లిపారు. జిల్లా లో మాదక ద్రవ్యాల అక్ర మ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగు తోందని, చట్ట వ్యతిరేక కార్యకలాపాల కు పాల్పడే వారి పై కఠిన చర్యలు తీసు కుంటామని పోలీసులు హెచ్చరించారు.

## జబల్ పూర్ ఐఐఐటిలో జరిపి యువకుడికి సీటు



ప్రజాస్ఫూర్తి , బైంసా : నిర్మల్ జిల్లా తానూరు మండలంలోని ఝురి బీ గ్రామానికి చెందిన శ్రీకర్ యాదవ్ ప్రతిష్టాత్మక జబల్పూర్ ఐఐఐటి కాలేజీలో సీటు సాధించాడు. తండ్రి ఈశ్వర ప్రోత్సాహంతో, కటైన శ్రమ పట్టుదలతో జాతీయస్థాయి విద్యాసంస్థల లో సీటు సాధించిన శ్రీకర్ను గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## సీసీ రోడ్డు , డ్రైనేజి నిర్మాణాల ప్రొసీడింగ్ కాపీలు అందచేసిన ముధోల్ మాజీ ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని పలు గ్రామాల లోని సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణ కోసం సుమారు 60 లక్షల పైన నిధులు మంజూరు కాపీని ఆదివారం కుబీర్ మండల నాయకులకు అందజేశారు. నిధులు మంజూరు చేసి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు కి, ముధోల్ మాజీ శాసనసభ్యులు గాడ్డిగారి విఠల్ రెడ్డికీ కుబీర్ మండల ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు.ఈ కార్యక్రమంలో కుబీర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గోనెలు కళ్యాణ్,కుబీర్ సర్పంచ్ సాయినాథ్,మొల సర్పంచ్ శ్రీధర్, సప్లీ సర్పంచ్ సాయి,సోనారి సర్పంచ్ నరసింహ,మాజీ సర్పంచ్ విజయ్, ఏఎంసి డైరెక్టర్ అరుణ్ సీనియర్ నాయకులు బెల్యాల గంగయ్య, మిలింద్,బోడిగం సాయి, యోగేష్,తదితరులు ఉన్నారు.

## రక్తదానం ప్రాణదానం

**: ఎమ్మెల్యే గండ్ర**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : రక్తదానం ద్వారా మరొకరికి ప్రాణం పోసే అవకాశం లభిస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. జిల్లా కేంద్రంలో ఐటీ మాస్టర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాద బాధితులు, శస్త్ర చికిత్సలు చేయించుకునే రోగులు, గర్భిణీలు తదితరులకు రక్తం అత్యవసరమని పేర్కొన్నారు. ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం వల్ల ఆరోగ్యానికి ఎలాంటి హాని ఉండదని, నిర్దిష్ట వ్యవధిలో రక్తదానం చేయడం సమాజానికి గొప్ప సేవగా నిలుస్తుందని తెలిపారు. యువత సామాజిక బాధ్యతతో రక్తదాన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ భవనం మరో ఆరు నెలల్లో పూర్తవుతుందని వెల్లడించారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమాన్ని నిర్వహించిన వేముల శంకర్‌తో పాటు నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, ఐటీ మాస్టర్ సభ్యులు, యువకులు, రక్తదాతలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## చిన్న ఉమెంత్యాల గ్రామంలో ఘనంగా మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : చిన్నఉమెంత్యాల గ్రామంలో ఈనెల 17 నుండి 18 వ తేదీ వరకు వైభవంగా జరుగనున్న మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని చిన్నఉమేంత్యాల గ్రామ పెద్దలు ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి , విగ్రహ ప్రతిష్ట మహోత్సవ ఏర్పాట్లకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి రూ.50,000 విరాళాన్ని గ్రామ పెద్దలకు అందజేశారు.ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి రూ.50,000 విరాళాన్ని అందించినందుకు గ్రామ ప్రజల తరపున ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి గ్రామ పెద్దలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ,మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో చిన్నఉమేంత్యాల సర్పంచ్ జ్యోతి శ్రీనివాస్ రెడ్డి,మాజీ సర్పంచ్ నర్సిములు,మాజీ ఎంపిపి తనయుడు గోపాల్,అయోధ్య పూర్ సర్పంచ్ గోపాల్ నాయక్, చింతకుంటతండా సర్పంచ్ హరినాయక్,చిన్న ఉమేంత్యాల గ్రామ పెద్దలు రాయికంటి కృష్ణారెడ్డి, ఎన్నంపల్లి రాఘవేందర్ రెడ్డి,బాలనగర్ హనుమంత్ రెడ్డి,ఈగ నర్సిమ రెడ్డి,ఆనంద్,భూపాల్ గౌడ్ , పిర్జపూర్ బీఆర్ఎస్ యువ నాయకులు రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన ఎరువులు విత్తనాలు రైతులకు సబ్సిడీపై అందించాలి

* **ఏ ఐ కె ఎమ్ ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బజ్జూరి వెంకటరామిరెడ్డి డిమాండ్**



ప్రజా స్ఫూర్తి, కూసుమంచి: పాలేరు గ్రామం చాపల అప్పయ్య నగర్ లో అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ కూసుమంచి మండల మహాసభ మాతంగి రామ స్వామి అధ్యక్షతన నిర్వహించారు. మాతంగి రామస్వామి జెండా ఆవిష్కరించి. అమరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బజ్జూరి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు స్వామినాధన్ సిఫారసు సీ2 ప్లస్ 50 ప్రాతిపదికన మద్దతు దర ఇచ్చి రైతులను 2022 కల్లా ధనిక రైతులను చేస్తానని చెప్పిన మాటలు పచ్చి మోసం అని తేలిపోయిందన్నారు. రైతులకు సరిపడా యూరియా ఇవ్వకుండా కేంద్రం నాటకాలు ఆడుతుందని మండిపడ్డారు ఐదు రాష్ట్రాల ఎన్నికలు అయిపోయిన తర్వాత యుద్ధం పేరు చెప్పి పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను నిత్యవసర వస్తువుల రేట్లు పెంచడం మూలంగా సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. పండిన పంటలు నెలల కొద్దీ మార్కెట్లో కాపలా కావల్సిన పరిస్థితి ఉందన్నారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గాన్ని సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ కూసుమంచి సబ్ డివిజన్ కార్యదర్శి ఐ వెంకన్న ప్రతిపాదించగా ఏ ఐ కె ఎమ్ ఎస్ రాష్ట్ర నాయకులు ఏం గిరి వారితో ప్రతిజ్ఞ చేయించారు. సభను ఉద్దేశించి ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు ఎం రాజేంద్రప్రసాద్. కే సురేష్ మాట్లాడటం జరిగింది. నూతన కమిటీ అధ్యక్షులు మాతంగి రామస్వామి,కార్యదర్శి చెరుకుపల్లి వీరయ్య,సహాయ కార్యదర్శి చాపల సత్యనారాయణ,ఉపాధ్యక్షులు నిమ్మల వెంకన్న,సభ్యులు బత్తుల వీరన్న ,నోముల రంగారావు,పోటు లక్ష్మయ్య,బుర్ర సైదులు,దాట్ల వీరస్వామి,రెడ్డిబోయిన సంజీవరావు లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో శీలం సుదర్శన్,గోపి రవి,కనకం గోపయ్య, కాంపాటి మధు, లింగ, చాపల రామయ్య, మదికుంట్ల సత్యం,చాపల కృష్ణయ్య,పి ఓ డబ్ల్యు జిల్లా నాయకురాలు కే కల్పన,మున్నా సుశీల,నాగమణి, హైమా, ఉమా ,ఉప్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పేద రైతులకు స్ప్రే పంపులు, టార్పలిన్ కవర్లు ఉచిత పంపిణీ



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కేసముద్రం రోడ్ శ్రీ చైతన్య స్కూల్ లో ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సి ఎస్ ఆర్ ఫండ్ సహకారంతో రైతులకి ఉచిత స్ప్రే పంపు, టార్పలిన్ కవర్లను రైతులకు ఉచితంగా ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో ఎస్సీ, ఎస్టీలకు ఎక్కడైతే అన్యాయం జరుగుతుందో న్యాయం చేయడానికి నన్ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎస్టీ కమిషన్ సభ్యులుగా నియమించడం జరిగింది. ఎస్టీ కమిషన్ లో నలుగురు సభ్యులం ఒక అధ్యక్షుడు ఉంటాడు. జడ్జి కున్నంత పవర్స్ నాకు ఉంటాయి.ఢిల్లీకి వెళ్లిన తర్వాత కేంద్ర సంస్థల్లో ఎంత మిగులు బడ్జెట్ ఉంటుందో దానివల్ల పేదవారికి ఆర్థిక సాయం చేయాలో విషయం తెలుసుకోవడం జరిగింది. జై జవాన్ జై కిసాన్ అనే నినాదంతో దేశ రక్షణలో జవాన్, గ్రామంలో అన్నం పెట్టే రైతన్న బాగుండాలి. సుమారుగా 2500 మంది పేద రైతులకు, గ్రామానికి ఐదుగురు చొప్పున ఎంపిక చేయడం జరిగింది. రెండుసార్లు ఎమ్మెల్యేగా నన్ను మీరు తిరస్కరించిన నరేంద్ర మోడీ నన్ను గుర్తించి ప్రజలకు సేవ చేసే మంచి సైనికుడు దొరికాడని జాతీయ కమిషన్ సభ్యులుగా మరింత సేవ చేయడానికి నన్ను గుర్తించారు. ప్రజలకు మరింత సేవ చేయాలనే ఉద్దేశంతో పేద వర్గాలకి గూడూరులో ఇంజనీరింగ్ విద్యార్థులకు లాప్టాప్ లు, స్ప్రే పంపు సెట్లు ఇప్పించడం జరిగింది.మరో రెండు వెయ్యిల సైకిళ్లు కూడా ఇప్పిస్తానని ఈ సభ ముఖంగా చెప్తున్నాను. ఈ కార్యక్రమంలో ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారి వెంకన్న, రఘువంశీ, కోమలి, జిల్లా వ్యవసాయ అధికారి స్వర్ణ జయచంద్ర ఆర్డిఓ రాజేశ్వరి,ఉద్యానవన శాఖ అధికారి మరియన్న మహబూబాబాద్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ జ్యోతి రమేష్,బిజెపి రాష్ట్ర నాయకులు అశోక్ రెడ్డి, వద్దిరాజు రామచంద్రరావు, బిజెపి మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు,రాణా ప్రతాప్ రెడ్డి, ఎమ్మార్వో రాజేశ్వరరావు,డిడి దేశి రామ్ నాయక్, చీకటి మహేష్ గౌడ్, సురేందర్, శశివర్ధన్ రెడ్డి శ్యామ్ సుందర్ శర్మ, ఇందు భారతి, విజయ, పద్మ, వివిధ గ్రామాల చెందిన రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాఠశాలల పునః ప్రారంభానికి సర్వం సిద్ధం

* **పాఠ్య పుస్తకాలు నోటు పుస్తకాలు అన్నిటిని పాఠశాల స్థాయిలో చేరివేత పూర్తి**
* **త్వరలో కొత్త డిజైన్లతో యూనిఫార్మ్స్ పంపిణీ**



కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : 202627 విద్యా సంవత్సరానికి పాఠశాలన్నీ పునః ప్రారంభం కాబోతున్నాయని, అంతా సర్వం సిద్ధం చేసినట్లు కూకట్ పల్లి మండల విద్యాధికారి రవీందర్ రాజు అన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి రవీందర్ రాజు ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల యొక్క ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన సంసిద్ధతను సమీక్షించడం జరిగిందన్నారు. ఈ విద్యా సంవత్సరానికి విద్యార్థులకు కావాల్సిన పాఠ్యపుస్తకాలను నోట్ పుస్తకాలను పాఠశాల స్థాయి వరకు చేర్చి విద్యార్థులకు 15వ తేదీ నుంచి అందజేయడానికి సంసిద్ధంగా ఉంచడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి బ్రేక్ ఫాస్ట్ , పాలు అందజేసే మొదటి దశ కార్యక్రమంలో భాగంగా కూకట్ పల్లి మండలంలో మూడు పాఠశాలలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూకట్ పల్లి, మండల ప్రాథమిక పాఠశాల కూకట్ పల్లి బాలికలు, మండల ప్రాథమిక పాఠశాల కూకట్ పల్లి బాలుర, లలో 15వ తేదీ నుంచి విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ ను అందజేయడం జరుగుతుందన్నారు. పాఠశాల ఆవరణలో తరగతిలో పరిశుభ్రత కిచెన్ షెడ్ ఎండిఎం యొక్క నిర్వహణ కావాల్సిన పరిశుభ్రత వంటి అంశాలపై విద్యార్థులకు తాగునీరు మధ్యాహ్న భోజనం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం ఒకటి నుంచి ఐదో తరగతి కే కాకుండా ఆరు నుంచి పదవ తరగతి వరకు కూడా వర్క్ బుక్స్ ను ప్రభుత్వం పంపిణీ చేయబోతోందన్నారు. నూతనంగా డిజైన్ చేయబడిన యూనిఫార్మ్స్ ని కూడా త్వరలో పంపిణీ చేయబోతున్నారన్నారు. ఈ సంవత్సరం విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే విద్యార్థుల యొక్క ఎన్రోల్మెంట్ , అభ్యసన సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోబోతున్నట్లు మండల విద్యాధికారి తెలియజేశారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అందరూ కూడా అనుమతులు లేకుండా పాఠశాలలు లేదా తరగతులు నిర్వహించకూడదని, విద్యార్థుల యొక్క చైల్డ్ సేఫ్టీ పైన ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలియజేశారు.

## జూనియర్ 11పై సీనియర్ 11 ఘన విజయం

* **57 బంతుల్లో 118 పరుగులు చేసిన రసూల ఖాన్**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:పట్టణంలోని ప్రకాశం స్టేడియంలో ఆదివారం జరిగిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో జూనియర్ 11 జట్టుపై సీనియర్ 11 జట్టు 8 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన సీనియర్ 11 జట్టు ముందుగా బ్యాటింగ్ చేసి నిర్ణీత 16 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసింది. జట్టులో రసూల్ ఖాన్ అద్భుత బ్యాటింగ్ ప్రదర్శిస్తూ కేవలం 57 బంతుల్లో 22 ఫోర్లతో 118 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. దశరథ్ రజువా 14 బంతుల్లో 3 ఫోర్లతో 22 పరుగులు చేసి నాటౌట్‌గా నిలవగా, రమేష్ 4 బంతుల్లో 4 ఫోర్లతో 16 పరుగులు చేశాడు. జూనియర్ 11 జట్టు బౌలర్లలో మహేష్ రెడ్డి, నాని నాయుడు, ప్రేమ్ చెరో వికెట్ సాధించారు. 184 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన జూనియర్ 11 జట్టు చివరి వరకు పోరాడినా లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. సాయి నాయుడు 46 బంతుల్లో 12 ఫోర్లతో 86 పరుగులు చేసి జట్టుకు ఆశలు రేకెత్తించాడు. కట్ట 19 బంతుల్లో 5 ఫోర్లతో 35, విశ్వనాథ్ 14 బంతుల్లో 19 పరుగులు చేశాడు. రామ్ రెడ్డి 8 బంతుల్లో 2 ఫోర్లతో 11 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. నిర్ణీత 16 ఓవర్లలో జూనియర్ 11 జట్టు 175 పరుగులు మాత్రమే చేయగలిగి 8 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. సీనియర్ 11 జట్టు బౌలర్లలో రవి సభాని రెండు వికెట్లు పడగొట్టగా, అప్పన్న, సత్తిపండు, పఠాన్ చెరో వికెట్ సాధించారు. ఈ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి తన కెరీర్‌లో తొలి సెంచరీ నమోదు చేసిన రసూల్ ఖాన్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. దాదాపు 25 సంవత్సరాల క్రితం ఆర్‌సీసీ, ఆర్‌వీఎం బ్లూస్ జట్ల తరఫున ఆడిన అనుభవజ్ఞులైన రసూల్ ఖాన్, దశరథ్ రజువా మరోసారి ప్రకాశం స్టేడియంలో మెరిసి తమ బ్యాటింగ్ ప్రతిభను చాటుకోవడం విశేషం.

## గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి 20 లక్షల రూపాయల నిధుల మంజూరు



ప్రజాస్ఫూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని సాంగ్వి గ్రామంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి 20 లక్షల రూపాయల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్, తెలియజేశారు.గ్రామంలో ప్రజలకు ఇబ్బందులు కలగ కుండా నూతన భవనాన్ని నిర్మించేందుకు ఈ నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామ సర్పంచ్ భోజేందర్ తో పాటు నాయకులకు ప్రొసిడింగ్ కాపీని అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ గ్రామస్తుల తరపున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఓటర్ల జాబితా సవరణపై అవగాహన సదస్సు



ప్రజాస్ఫూర్తి, భైంసా : టీపీసీసీ పిలుపు మేరకు భైంసా పట్టణంలోని బ్యాంకెట్ హాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై 'బీఎల్ఏ' ల అవగాహన,శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ్ రావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముధోల్ నియోజకవర్గ అభ్యర్థులు కోటియా నాయక్, రణప్రతాప్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, జాబితాలోని తప్పులను సవరించేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ శిబిరంలో మాజీ ఎంపీపీ భోజారం పటేల్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఓం లడ్డా, వివిధ మండలాల అధ్యక్షులు,యూత్ కాంగ్రెస్ నాయకులు,ఆత్మ చైర్మన్లు, సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్తూరు మండల ఉప సర్పంచుల సంఘం నూతన కమిటీ ఏర్పాటు



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : ఉప సర్పంచుల సంఘం నూతన కమిటీని రాష్ట్ర ఉప సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి మట్ట శ్రీనివాస్ గౌడ్, ఫరూక్‌నగర్ మండల ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడు ముక్కుపోగుల ప్రకాష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా ఫోరం సభ్యులు మల్కాయగారి గోవర్ధన్ రెడ్డి, ఎలుగని రాములు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడిగా గోనెల అండాలు రాజు, అధ్యక్షుడిగా మీసాల ఆరోగ్యం, ఉపాధ్యక్షుడిగా సున్నాల గణేష్, ప్రధాన కార్యదర్శిగా రామావత్ శంకర్ నాయక్, కోశాధికారిగా ఈటమౌని వెంకటమ్మ, ప్రచార కార్యదర్శిగా కేతావత్ స్వప్న రాందాస్, ప్రధాన సలహాదారుగా మామిడి శాంతం రెడ్డి, కార్యనిర్వాహణ కార్యదర్శిగా పట్లవత్ హనుమంతు ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతన కమిటీ సభ్యులకు సంఘం నాయకులు అభినందనలు తెలియజేస్తూ, ఉప సర్పంచుల సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం కోసం సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

# ఆర్ టివి ప్రతినిధి పై దాడి చేసిన నిందితుడి పై కఠిన చర్యలు తీసు కోవాలి

*** తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్**

జనగామ, ప్రజాస్ఫూర్తి : విధి నిర్వహణ లో ఉన్న ఆర్టీవి ప్రతినిధి గొల్లపెల్లి వెంకట రత్నం పై జరిగిన దాడిని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు ఇర్రి మల్లారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. యశ్వం తాపూర్ సమీపం లో ఇటీవల జరిగిన లారీ ప్రమాదానికి సంబంధించిన పరిస్థి తులను పరిశీలిస్తూ, ఉమ్మడి వరంగల్ జిల్లా లో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల పైగ్రౌండ్ రిపోర్ట్ నిర్వహిస్తున్న సమయం లో టి.వి ప్రతినిధి పై లారీ యజమాని దురుసుగా ప్రవర్తించి దాడికి పాల్పడిన ట్లు ఆయన తెలిపారు. జర్నలిస్టును బె దిరించడం, వెనక్కి తోసేయడం వంటి చర్యలు ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రిక స్వేచ్ఛ పై దాడిగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఘటన పై ఫిర్యాదు చేయడానికి వెళ్లిన విలేకరికి జనగామ, రఘునాథపల్లి పోలీస్ స్టేషన్లు తమ పరిధిలోకి రాదని చెప్పడం ఆందో ళనకరమని పేర్కొన్నారు.మూడు రోజుల క్రితం జరిగిన ప్రమాదానికి సంబంధించి కేసు నమోదైందా లేదా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టుల పై దాడులు జరగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, ఇటువంటి ఘటనలు పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తాయని అభిప్రాయపడింది. దాడికి పాల్పడిన లారీ యజమాని పై వెంటనే కేసు నమో దు చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీ సుకోవాలని, జర్నలిస్టుల భద్రతకు తగి న చర్యలు చేపట్టాలని జిల్లా పోలీసు అ ధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకటస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి సురి గల బిక్షపతి, ఓరుగంటి సంతోష్, బొల్లు ఎల్లారెడ్డి, కొత్తపెల్లి కిరణ్,ఆనంద్, శ్రీకాంత్ రెడ్డి, రమేష్, ఎజాజుద్దీన్, బా స్కర్,ఉపేందర్, శ్రీనివాస్,మణి తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఘనంగా చేగువేరా జయంతి వేడుకలు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో స్థానిక నలంద డిగ్రీ కళాశాల నందు చేగువేరా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ డోలి సత్యనారాయణ మాట్లాడుతూ చేగువేరా పోరాట ప్రతీమను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. గెరిల్లా ఉద్యమం ద్వారానే క్యూబా దేశ స్వతంత్రాన్ని సాధించుకోవడమే కాకుండా అదే స్ఫూర్తితో పోరాటాల ద్వారానే తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు నడిపించి తెలంగాణను సాగించుకోవడం జరిగింది. ప్రతి ఒక్కరు చేగువేరా జీవిత చరిత్రలు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సామాజిక అధ్యయన వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పార్నంది రామయ్య, కోట సుధాకర్, బుర్ర గోవర్ధన్, పమ్మి నాగబ్రహ్మం,బాలాజీ నాయక్,తోడేటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై అత్యాచారం హత్యా ప్రయత్నం చేసిన గౌస్ పాషను కఠినంగా శిక్షించాలి

*** తెలంగాణ గిరిజన సామాజిక చైతన్య వేదిక అధ్యక్షులు గుగులోత్ కిషన్ నాయక్ డిమాండ్**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు కిషన్ నాయక్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో నిరుపేద రజక కులానికి చెందిన మైనర్ బాలిక 12 సంవత్సరాల ఉన్న బాలిక మీద అఘాయిత్యం జరిపి, బిల్డింగ్ మీద నుండి కింద పడేసిన గౌస్ పాషాను కఠినంగా శిక్షించాలి.అతని మీద పోక్సో అత్యాచార నేరం చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం, బాలిక కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలి. బాలికకు పూర్తిగా నాణ్యమైన వైద్య పరీక్షలు నిర్వహించి ఆమెను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం, ఖమ్మం జిల్లాలో అందరూ అగ్రకుల కమ్మ, రెడ్లు ఉండడం వలన ఈ నిరుపేద మైనర్ బాలికకు అన్యాయం జరిగే అవకాశం ఉన్నది. ఆ బాలికకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సదుపాయాలు అందించాలని కిషన్ నాయక్ డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికైనాప్రజాస్వామ్యవాదులు, ఉద్యమకారులు వివిధ రాజకీయ పార్టీలు రజక బిడ్డ మీద అన్యాయం జరిగిన విషయంలో ఆదుకొని చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టలాడుతున్న రజక బిడ్డను ఆదుకొని ఆ కుటుంబాన్ని కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాము.

# గుర్రం వెంకటరెడ్డి కి కాంగ్రెస్ నాయకులు ఘన నివాళి



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి మండలంలో గల గానుగబండ గ్రామంలో జరిగిన గానుగబండ మాజీ ఎంపీటీసీ గుర్రం వెంకటరెడ్డి దశధిన కార్యక్రమంలో గరిడేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించి,వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు త్రిపురం అంజన్ రెడ్డి, పైడిమర్రి రంగనాథ్, బచ్చలకూరి కృష్ణ, షేక్ చాంద్, దేవదానం, కోటిరెడ్డి, పరమేష్, సందీప్, శంబయ తదితరులు పాల్గొన్నారు.

# చెరువులోకి నీరు రాకుండా అక్రమంగా మట్టి నింపిన వారిపై చర్యలు తీసుకోవాలి

*** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చెరువులోకి నీరు రాకుండా అక్రమంగా మట్టిని నింపి కట్టగా మార్చిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన నిర్వహించారు. చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామ చెరువు భూమిలో అక్రమంగా పెద్ద ఎత్తున నింపిన మట్టిని అంబేద్కర్ సంఘం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగారం చెరువు భూమిలో మట్టిని నింపి సేద్యం చేస్తున్న విషయం విధితమేనన్నారు. చెరువులోకి నీరు రాకుండా అడ్డుకట్ట వేసే విధంగా మట్టిని పెద్ద ఎత్తున అక్రమంగా నింపడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండల నుంచి వచ్చే నీరు నాగారం చెరువులోకి చేరుతుందని, అక్రమంగా మట్టిని కట్టగా నింపడంతో నీరు రావడం లేదని ఆరోపించారు. నాగారం చెరువు నిండితే గొలుసు చేరువైన తంగడపల్లి చెరువులోకి నీరు వెళుతుందని పేర్కొన్నారు. చెరువు ఒకసారి నిండితే మూడు సంవత్సరాల వరకు చుట్టుపక్కల గ్రామాలైన పీపల్ పహడ్, అల్లాపురం, కొయ్యలగూడెం గ్రామాలకు సాగునీరు సమృద్ధిగా అందుతుందని పేర్కొన్నారు. చెరువులోకి నీరు రాకుండా అడ్డుకోవడంతో, భవిష్యత్తులో నాగారంతో పాటు చుట్టుపక్కల గ్రామాలలో తీవ్ర నీటి కరువు ఏర్పడుతుందని, తద్వారా రైతులు సేద్యం చేయడం కష్టతరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి చెరువు భూమిలో కట్టగా నింపిన మట్టిని పూర్తిగా తొలగించి, కుచించుకుపోయిన చెరువు సామర్థ్యాన్ని యధాతథంగా మార్చాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం బొమ్మ బిక్షమయ్య, 8వ వార్డు సభ్యుడు ఊదరి రమేష్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు వడ్డేపల్లి శ్రీనివాస్, ఏచూరి నర్సింహా, బొమ్మ కిష్టయ్య, వడ్డేపల్లి బుచ్చయ్య, బొమ్మ సాలయ్య, కుంటి పాపయ్య, బొమ్మ రాములు, కుంటి యాదయ్య, ఒంటెద్దు నాగరాజు, బొమ్మ లింగస్వామి, పెద్దబొమ్మ మల్లేష్, చీమకండ్ల శ్రీను, వడ్డేపల్లి రాజు, బొమ్మ వెంకటేష్, కుంటి గణేష్, కుంటి రాజు, కుంటి శంకర్, గడ్డం శివ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ఫౌండేషన్ కోర్సులు ప్రారంభం



జనగామ, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను జేఈఈ,నీట్,క్లాట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధం చేసేందుకు జిల్లాలోని కేజీబీవీలు , పీఎం శ్రీ, మోడల్ పాఠశాలల్లో ప్రత్యేక ఫౌండేషన్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఆదివారం జిల్లా సమీకృత కలెక్ట ర్ కార్యాలయం లో నిర్వహించిన సమీ క్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ 8వ, 9వ, 10వ తరగతి విద్యార్థులకు అన్ అకాడమీ నిపుణుల ఆధ్వర్యంలో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించనున్న ట్లు తెలిపారు. జిల్లాలో ఎంపిక చేసిన 28 పాఠశాలల్లో సోమవారం నుంచి ఈ తరగతులు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. విద్యార్థులకు బేసిక్ మ్యా థ్స్, సైన్స్, ఇంగ్లీష్ అంశాల్లో బల మైన పునాదులు ఏర్పడి, భవిష్యత్తులో ఉన్న త విద్యా అవకాశాలు అందిపుచ్చుకు నేందుకు ఈ కార్యక్రమం దోహదపడు తుందని కలెక్టర్ పేర్కొన్నారు. అన్ని పాఠశాలల్లో తరగతులను క్రమం తప్పకుం డా నిర్ణీత సమయానికి ఆన్‌లైన్ తరగతులు క్రమం తప్పకుండా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. తరగతుల హాజరు, బోధన అంశాలు, విద్యార్థులు పాల్గొనడం వంటి వివరాలను ప్రత్యేక రిజిస్టర్ లో నమోదు చేయాలని, ప్రతి వారాంతంలో పురోగతిని సమీక్షించాలని సూచించారు. విద్యార్థుల్లో పోటీ పరీ క్షల పట్ల ఆసక్తి పెంపొందించి, ఉన్నత లక్ష్యాల సాధనకు మార్గనిర్దేశం చేయడంలో ఈ కార్యక్రమం కీలకంగా నిలుస్తుం ద ని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ఏ.డీ శ్రీనివాస్, జీసీడీఓ గౌసియా బేగం, అన్ అకాడమీ ప్రతినిధులు, వివిధ ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ఆమడ దూరంలో విశ్వకర్మలు

*** సాంస్కృతిక శాఖ సలహాదారుడు దరువు అంజన్న**




ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్ :కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో విశ్వకర్మలు అభివృద్ధికి ఆమడ దూరంలోవున్నారని,నియోజకవర్గంలో వేల సంఖ్యలో విశ్వకర్మలు జీవిస్తున్నప్పటికీ రాజకీయ పార్టీలు వీళ్ళ ఓట్లను దండుకుంటున్నారే తప్ప వీరికి సరైన సౌకర్యాలు కల్పించట్లేదని కనీసం ఒక కమిటీ హాల్ కూడా నిర్మించలేదని తెలంగాణ ప్రభుత్వ టూరిజం సాంస్కృతిక శాఖ సలహాదారులు దరువు అంజన్న అన్నారు. ఆదివారం సూరారం విశ్వకర్మ కాలనీలో జరిగిన శ్రీ విరాట్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ద్వితీయ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైనాడు. ఈ సందర్భంగా అంజన్న మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం ఎమ్మెల్యే వివేకానంద జగద్గిరిగుట్టలో విశ్వకర్మలకు కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని హామీ ఇచ్చారని అదే విధంగా కైసర్ నగర్ ప్రాంతంలో విశ్వకర్మలకు స్థలాన్ని కేటాయిస్తానని హామీ ఇచ్చారని కానీ ఆ మాటను ఇప్పటికీ నిలబెట్టుకోలేదని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే విశ్వకర్మలను చిన్నచూపు చూడకుండా వారికి స్థలాన్ని కేటాయించి కమ్యూనిటీ హాల్ నిర్మించి విశ్వకర్మల ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీ విరాట్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం వారు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించాడు. ఈ కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షులు పొలిగారం కృష్ణమాచారి, ప్రెసిడెంట్ కమ్మరి లక్ష్మణాచారి మరియు ఎస్ ఆర్ నాయక్ నగర్ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఆలూరి శేషాచారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది

*** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి,జగద్గిరిగుట్ట : ప్రజలు ధైర్యంగా ఉండాలని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారి సమస్యల పరిష్కారానికి అండగా ఉంటుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. ఆదివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో నెలకొన్న పలు ప్రజా సమస్యలపై కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాదయాత్ర నిర్వహించారు. కాలనీవాసులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యలను పరిష్కరిస్తామని,చిరు వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అతి త్వరలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డీసీసీ సెక్రటరీ గణేష్, డీసీసీ స్పోక్స్‌పర్సన్ భారత్ గౌడ్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కావలి చంద్రయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, కృష్ణ గౌడ్, రషీద్ , పిల్లి ఆంజనేయులు, బుచ్చిరెడ్డి, చంద్రశేఖర్, లక్ష్మణ్, శ్రీనివాస్, యువరాజ్, మహిళా నాయకురాలు కౌసల్య, చంద్రకళ, అనిత రెడ్డి, మాధవి రెడ్డి, రాజీవ్ గృహకల్పవాసులు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడే పాఠశాలలు పున: ప్రారంభం

*** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రతీక గా ప్రభుత్వ పాఠశాలలు**

*** జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్**



ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: పాఠశాలల పునఃప్రారంభం నేపథ్యంలో విద్యా ప్రణాళికకు రూపొందించుకొని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సోమవారం నుంచి పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలలు 928 , ప్రైవేట్ పాఠశాలలు 109. మొత్తం 1037 స్కూల్స్ పునః ప్రారంభం అవుతాయని. అందులో ప్రభుత్వ 83,000 , ప్రైవేటు 43,000 మొత్తం 1,26,000 మంది విద్యార్థులు బడిబాట పట్టనున్నారని తెలిపారు.విద్యాశాఖ కొత్త పుస్తకాలు, విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఒకటో తరగతి విద్యార్థులకు ప్రత్యేక స్వాగత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, మధ్యాహ్నభోజన ఏర్పాట్లపై అధికారులు దృష్టి సాధించారన్నారు. హాజరు శాతం పెంపు, డిజిటల్ బోధనకు ప్రాధాన్యం ఇవ్వనున్నామని తెలిపారు.విద్యార్థినీ, విద్యార్థులు నూతన ఉత్సాహంతో పాఠశాలలో అడుగు పెట్టాలన్నారు. కార్పొరేట్ స్థాయికి దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన గుణాత్మక విద్య నందిస్తున్నామని తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను పంపించే బాధ్యత తల్లితండ్రుల దేనని గుర్తు చేశారు.ఈ విద్యా సంవత్సరాన్ని మనం ప్రారంభిస్తున్న ఈ తరుణంలో, మన పాఠశాల సామరస్యంతో, విజయంతో నిండిపోవాలని ఆకాంక్షించారు.

# తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్టంలో ఉప్పెనలా దూసుకొస్తుంది

*** తెలంగాణ రక్షణ సేన షాద్ నగర్ ఇంచార్జ్ సీమల రమేష్ కురుమ**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : తెలంగాణ రాష్ట్రంలో కల్వకుంట్ల కవితమ్మ స్థాపించిన తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్టంలో ఉప్పెనలా దూసుకొస్తుందని, ప్రజా సమస్యలపై గలమెత్తి, ప్రభుత్వంతో పని చేయించే సత్తా కల్వకుంట్ల కవితమ్మకే ఉన్నదని ఆ పార్టీ షాద్నగర్ నియోజకవర్గం ఇంచార్జ్ సీమల రమేష్ కురుమ అన్నారు. ఆదివారం షాద్ నగర్ పరిది చటాన్ పల్లి గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి షాద్ నగర్ నియోజకవర్గం ఇంచార్జి సీమల రమేష్, రాజేంద్రనగర్ ఇంచార్జ్ విష్ణుమూర్తి, స్టేట్ అబ్జర్వర్ తాండ్ర శ్రీనివాసరావు, తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మొదటగా స్థానికంగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి సీమల రమేష్ కురుమ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పాలకుల వైఫల్యాలను ఎండగట్టడానికి, ప్రజల హక్కుల కోసం పోరాడటానికి కవితక్క నాయకత్వంలో తెలంగాణ రక్షణ సేన ఆవిర్భవించిందని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో షాద్‌నగర్ నియోజకవర్గంలో పార్టీని తిరుగులేని శక్తిగా మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు రంగన్న గౌడ్, ఇమామ్, శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ గౌడ్, కె.వి చారి, పవన్ కుమార్, అంజన్న, అర్జున్, వెంకటయ్య, శ్రీకాంత్ రెడ్డి, శంకర్, మల్లయ్య, జిల్లెడు చౌదరిగుడా మండల అధ్యక్షులు ఆంజనేయులు, మహిళ నాయకురాలు ప్రవీణ, మాజీ సర్పంచ్ దుర్గమ్మ, శాంతమ్మ పెంటమ్మ, సుగుణమ్మ, మంగమ్మ, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకు కారుణ్యా నియామకుల ఘన సన్మానం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): సింగరేణి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు సాధించిన భూపాలపల్లి డివిజన్‌కు చెందిన సుమారు 60 మంది అభ్యర్థులు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కారుణ్య నియామకాల ప్రక్రియ నిలిచిపోయిన సమయంలో తమ సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రస్తావించడమే కాకుండా, ప్రభుత్వంతో పలుమార్లు చర్చించి తమకు న్యాయం జరిగేలా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నిరంతరం కృషి చేశారని అభ్యర్థులు పేర్కొన్నారు."మా కుటుంబాలకు భరోసా కల్పించిన ఈ ఉద్యోగాల సాధనలో ఎమ్మెల్యే పాత్ర మరువలేనిది" అని వారు అన్నారు. తమకు అండగా నిలిచి ఉద్యోగాల కలను సాకారం చేసినందుకు ఎమ్మెల్యేకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించి తమ ఆనందాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ ఉద్యోగం అనేది కేవలం ఉపాధి మాత్రమే కాదని, కుటుంబాలకు భవిష్యత్‌కు భరోసా అని అన్నారు. ఉద్యోగాలు పొందిన వారందరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ సింగరేణి అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను అభినందిస్తూ వారి కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు.

# కారుబొలెరో ఢీ.. ఒకరి మృతి, 20 మందికి గాయాలు

యర్రగొండపాలెం: మార్కాపురం జిల్లాలో ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. కారు, బొలెరో ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతిచెందగా, 20 మందికి గాయాలయ్యాయి. యర్రగొండపాలెం నుంచి మార్కాపురం వెళ్లే మార్గంలో లక్ష్మీవెంకటేశ్వర దాబా వద్ద ఈ ప్రమాదం జరిగింది. మృతురాలిని రమణమ్మ (45)గా గుర్తించారు. ప్రయాణికుల్లో నారాయణరెడ్డి, దేవికి తీవ్రగాయాలయ్యాయి. ప్రస్తుతం వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గాయపడిన మిగిలిన క్షతగాత్రులను కూడా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తెలంగాణలోని ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం దుబ్బతండాకు చెందిన 17 మంది బొలెరో వాహనంలో పుల్లలచెరువు మండలం నరజాముల తండా సమీపాన ఉన్న మంత్రిస్వామి దేవాలయానికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వారు శ్రీశైలానికి బయల్దేరారు.

# ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

* సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అనంతరం మోడల్ స్కూల్ పక్కనగల ప్రభుత్వ భూమిలో నేడు సిపిఐ ఆధ్వర్యంలో జెండాలు బాతి వందలాదిమంది ఇల్లు లేని నిరుపేదలు ఇంటి స్థలాల కై భూ పోరాటం నిర్వహించారు. ముందుగా గుడిసె వేసి సిపిఐ జెండాను గుడిసెకు కట్టి అనంతరం సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో వేలాదిమంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసి నిరుపేద కుటుంబాలు ఇండ్ల కిరాయి కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నిరుపేదల ఇంటి స్థలాల కోసమే సిపిఐ భూ పోరాటం నిర్వహిస్తుందన్నారు. ఈ జిల్లా కేంద్రంలో ఎన్నో ఇండ్లుగా 20 ప్రభుత్వ భూముల్లో కాలనీలు వేసి వేలాదిమంది ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనార్టీ, ఓసి నిరుపేదలకు ఇంటి స్థలాలు పంచామన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని మోసం చేసిందని ఒకరికి కూడా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వలేదన్నారు. నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని పూర్తిస్థాయిలా ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని ఉంటున్న నిరుపేదలకు ఇంటి పట్టాలు, ఇంటి నెంబర్లు వెంటనే ఇవ్వాలన్నారు. భూ పోరాటం ద్వారా ఈ ప్రాంతంలో పేద ప్రజలకు ఇంటి స్థలాలు పంచేందుకు సిపిఐ ముందుకు పోతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పెరుగు కుమార్, రేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, నర్రా శ్రావణ్, వెలుగు శ్రావణ్, ఆబోతు అశోక్,కేదాసు రమేష్, మంద శంకర్, ఎర్రోజు పద్మ, రాగ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# అన్న-అక్క వస్తారు డిజిటల్ పాఠాలు చెబుతారు!

* ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హుస్సేన్




ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 'అన్నఅక్క' మెంటార్ షిప్ కార్యక్రమంలో కీలక భాగస్వామిగా ముందుకు వస్తోంది.ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాలలో ఐదవ సెమిస్టర్ చదువుతున్న 401 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో బోధన కార్యక్రమంలో పాల్గొననున్నారని కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ తెలిపారు. విద్యార్థులందరికీ ఇది తప్పనిసరి ఇంటర్న్‌షిప్‌గా అమలు చేయబడుతుందని, వారికి నాన్‌సీజీపీఎ అకాడమిక్ క్రెడిట్‌తో పాటు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ కూడా అందజేయబడుతుందని పేర్కొన్నారు.సాంకేతిక రంగంలో జరుగుతున్న మార్పులను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేరవేయాలనే లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ 'అన్నఅక్క' మెంటార్‌షిప్ కార్యక్రమాన్ని అమలు చేయనుంది. ఈ కార్యక్రమం ద్వారా డిగ్రీ,పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించనున్నారు. ముఖ్యంగా కృత్రిమ మేధ , డిజిటల్ లిటరసీ, ఇంటర్నెట్ భద్రత, గేమ్ డిజైనింగ్, పైథాన్ వంటి నూతన సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించనున్నారు. గత విద్యాసంవత్సరంలో పైలట్ ప్రాజెక్ట్‌గా నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతమైంది. దీనిలో భాగంగా 15 డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 184 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో బోధన చేపట్టి విద్యార్థులలో సాంకేతిక అవగాహన పెంపొందించారు.ఈ విజయాన్ని దృష్టిలో ఉంచుకొని కొత్త విద్యాసంవత్సరం లో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని విద్యాశాఖ నిర్ణయించిందని తెలియజేశారు. ఈ ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో జనరల్ డిగ్రీ ఐదవ సెమిస్టర్ విద్యార్థులు, అప్రెంటిస్‌షిప్ డిగ్రీ మూడవ సెమిస్టర్ విద్యార్థులు పాల్గొనవచ్చు. మొత్తం 30 గంటల బోధనకు ఒక నాన్ సీజీపీఎ అకాడమిక్ క్రెడిట్ ఇవ్వబడుతుంది. "కోడ్ మిత్ర" పోర్టల్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులను ఎంపిక చేసి పాఠశాలలకు పంపనున్నారు.ఈ కార్యక్రమం విజయవంతంగా అమలు కావడానికి ఈనెల 16,17 తేదీలలో మాస్టర్ ట్రైనర్ చంద్రకళ మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నోడల్ ఫ్యాకల్టీ ఎంపిక చేసిన 100 మంది విద్యార్థులకు శిక్షణ అందించనున్నారు. అనంతరం ఈ విద్యార్థులు మిగతా వారికి శిక్షణ ఇచ్చి, జూలై 1 నుండి ప్రభుత్వ పాఠశాలల్లో కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

# ఆపదలో ఉన్నవారిని అక్కున చేర్చుకున్న సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : కేసముద్రం మండలం, ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సారయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తిని కోల్పోవడంతో భార్య అమల,కుమార్తె ప్రియ, తల్లి ఉప్పమ్మలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సారయ్య అంత్యక్రియలను నిర్వహించేందుకు కూడా కుటుంబ సభ్యులకు ఇబ్బందులు ఎదురవడంతో గ్రామస్తులు,దాతలు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి అంతిమయాత్రలను నిర్వహించారు. ఈ విషయం సామాజిక సేవకుడు చిలువేరు సమ్మిగౌడ్ దృష్టికి రావడంతో వెంటనే స్పందించారు. ప్రస్తుతం సమ్మిగౌడ్ అత్యవసర పనుల నిమిత్తం అందుబాటులో లేకపోయినప్పటికీ, బాధలో ఉన్న ఆ కుటుంబాన్ని మరవకుండా తన ఫౌండేషన్ సభ్యులను ప్రత్యేకంగా పంపించి సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తక్షణ సాయంగా బియ్యం పంపిణీ చేయించారు. అవసరంలో ఉన్న కుటుంబానికి అండగా నిలుస్తూ తన మానవత్వాన్ని చాటుకున్నారు. కష్టకాలంలో వారు ఒంటరిగా లేరని,



సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సునీత కుమార్, 8వ వార్డు సభ్యులు పలుస పద్మ వెంకన్న, 9వ వార్డు సభ్యులు తండా సంపత్, 12వ వార్డు సభ్యులు మంద ప్రవీణ్, మంద విక్రమ్, అడపా రమేష్, మంద సాయిబాబా, అంకిరెడ్డి రాంబాబు, నూకల లింగస్వామి, గద్దల హరీష్, కార్తీక్, దుర్గయ్య సురేష్, ప్రభాకర్, వెన్ను సురేందర్, పిట్టల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ జంట జలాశయాలకు పెరిగిన వరద ప్రవాహం.. అలర్ట్ జారీ

హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో శనివారం కురిసిన భారీ వర్షాలకు హైదరాబాద్ తాగునీటి అవసరాలు తీర్చే జంట జలాశయాలకు వరద ప్రవాహం పెరిగింది. ఉస్మాన్‌సాగర్ (గండిపేట), హిమాయత్‌సాగర్‌కు ఇన్‌ఫ్లో పెరగడంతో అధికారులు మూసీ నది పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. హైదరాబాద్ జలమండలి అధికారులు ఎప్పటికప్పుడు నీటి మట్టాలను, ఇన్‌ఫ్లోను నిశితంగా గమనిస్తున్నారు. ఆదివారం ఉదయం 6 గంటల సమయానికి అందిన సమాచారం ప్రకారం.. జలాశయాల్లోకి సుమారు 800 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఉస్మాన్‌సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం (FTL) 1,790 అడుగులు కాగా, ప్రస్తుతం 1,784.30 అడుగుల వద్ద నీరు ఉంది. అదేవిధంగా, హిమాయత్‌సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,763.50 అడుగులు కాగా, ప్రస్తుతం



## తెలంగాణలో ఈనెల 18 నుంచి 20 మధ్య భారీ వర్షా లు!

హైదరాబాద్: తెలంగాణలో ఈనెల 18 నుంచి 20 మధ్య భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. రానున్న మూడు, నాలుగు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు నెమ్మదిగా కదులుతున్నాయని.. నాలుగైదు రోజుల్లో రాష్ట్రమంతటా విస్తరించే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. ఇవాళ, రేపు, ఎల్లుండి కొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలతో పాటు 30-40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.



## హైదరాబాద్‌లో కాక్రోచ్ జనతా పార్టీ నిరసన ప్రదర్శన

హైదరాబాద్: దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన కాక్రోచ్ జనతా పార్టీ.. హైదరాబాద్‌లో నిరసన చేపట్టింది. పరీక్షా పత్రాల లీకేజీలు, విద్యావ్యవస్థలోని అవకతవకలను నిరసిస్తూ ధర్నాచౌక్ వద్ద భారీ ప్రదర్శన నిర్వహించింది. పర్యావరణవేత్త, ఉద్యమ నేత సోనమ్ వాంగ్‌చుక్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తదితరులతోపాటు యువత పెద్దఎత్తున పాల్గొంది. నీట్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆకునూరి మురళి మాట్లాడుతూ.. "దేశంలో ఎంతో సంపద ఉంది. అదంతా ఎక్కడికి వెళ్తోంది? దేశంలో నిరుద్యోగ పరిస్థితి ఎందుకు నెలకొంది? యువతను కాక్రోచ్‌లుగా పేర్కొనడం ఏంటి? దేశంలో ఆరు శాతం మంది యువతకు మాత్రమే నైపుణ్యాలు ఉన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. మరి మిగతావారికి అవి ఎందుకు అందటం లేదు? విద్యార్థులకు అన్యాయం చేసిన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. ఆయన్ను జైలుకు పంపాలి" అని డిమాండ్ చేశారు.



## కేంద్రం ఇచ్చిన నిధులపై సీఎం చర్చకు రావాలి: రామచందర్‌రావు



హైదరాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క కుటుంబమే బాగుపడిందని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. అంబర్‌పేటలో నిర్వహించిన భాజపా కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. "జీహెచ్‌ఎంసీ మూడు కార్పొరేషన్లు అయింది. 3 కార్పొరేషన్లలో భాజపా గెలిస్తే అభివృద్ధి జరుగుతుంది. కాంగ్రెస్ సర్కార్ పంట కొనుగోలు చేయకపోతే ఒత్తిడి తీసుకొచ్చాం. పండిన పంటలో కేంద్ర ప్రభుత్వం సగం కంటే ఎక్కువే కొనుగోలు చేసింది. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులపై సీఎం రేవంత్‌రెడ్డి చర్చకు రావాలి.సీఎం వస్తే సచివాలయం ఎదురుగా గణాంకాలతో వివరిస్తా. ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి భాజపాను ఓడించాలని చూస్తున్నాయి" అని రామచందర్‌రావు అన్నారు.

## రేవంత్‌రెడ్డి పాలన ఫస్టాఫ్ అట్టర్ ఫ్లాప్: కేటీఆర్

హైదరాబాద్: రేవంత్‌రెడ్డి పాలన ఫస్టాఫ్ అట్టర్ ఫ్లాప్ అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఆయన సర్కారు వేలాది మంది ఇళ్లను కూల్చిందని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. కేటీఆర్‌తోపాటు పార్టీ ముఖ్య నేతలు తలసాని శ్రీనివాస్ యాదవ్, దాసోజు శ్రవణ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదన్నారు. మీనాక్షి నటరాజన్‌కు వెన్నుపోటు పొడిచింది రేవంత్ రెడ్డేనని ఆరోపించారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి త్వరలో ఉపఎన్నిక వస్తోందని వ్యాఖ్యానించారు.





## నిత్య అల్పాహార దాత.. సదా స్మరామి

హైదరాబాద్: బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 1 నిమ్స్ ఆసుపత్రి గేటు పాద బాట వద్ద క్రమశిక్షణతో వరుసగా బారులు తీరిన వీరంతా రోగుల సహాయకులు, నిరుపేదలు. వీరంతా సార్ వస్తారు.. టిఫిన్ పెడతారు అంటూ ఓ గుప్త దాత కోసం నిత్యం ఏడు గంటలకే ఇలా నిలుచొని ఆయన అందించే రుచికరమైన అల్పాహారాన్ని చిరునవ్వుతో స్వీకరించి మనసులోనే కృతజ్ఞతలు చెబుతారు. కొన్ని నెలలుగా ఈ వితరణ కార్యక్రమం సాగుతున్నా దాత పేరు, వివరాలు ఎవరికీ తెలియవు. పంపిణీ సమయంలో 'ఈనాడు' గుర్తించి ఆయన్ను వివరాలు అడగ్గా.. తనకు చేతనైన ఈ సాయం చేసేందుకు వివరాలు ఎందుకని చిరునవ్వు నవ్వారు. చిన్న సాయం చేసి విపరీత ప్రచారం చేసుకుంటున్న ఈ రోజుల్లో ఇలాంటి వారూ ఉన్నారంటే అభినందించాల్సిందే.

# రాజ్యసభలో 2/3 మెజారిటీ దిశగా ఎన్డీయే!

దిల్లీ: పార్లమెంటు ఉభయసభల్లో ఎన్డీయే బలం పెరుగుతోంది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల అనంతరం తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఎగువ, దిగువ సభల్లో ఎన్డీయే బలం పుంజుకుంటోంది. ముఖ్యంగా రాజ్యసభలో మూడింట రెండొంతుల (2/3) మెజారిటీకి చేరువవుతోంది. రాజ్యాంగ సవరణ బిల్లుల సమయంలో ఈ మెజారిటీ ఎన్డీయేకు ఉపయోగపడుతుంది. అదే సమయంలో లోక్‌సభలో మాత్రం మూడింట రెండొంతుల మెజారిటీకి ఇంకాస్త దూరంలో నిలవనుంది. ఝార్ఖండ్, మిజోరంలో రాజ్యసభ స్థానాలకు జరిగే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు (భాజపా మద్దతు) గెలిస్తే ఎన్డీయే బలం 151కి చేరుకుంటుంది. తృణమూల్ నుంచి ఇటీవల ముగ్గురు రాజ్యసభ సభ్యులు రాజీనామా చేసిన నేపథ్యంలో ఉపఎన్నికలు రానున్నాయి. ఉప ఎన్నికలు నిర్వహించే ఈ మూడుసీట్లనూ భాజపా గెలుచుకునే అవకాశం ఉంది. దీంతో ఎన్డీయే సంఖ్యా బలం 154కు చేరనుంది. అయినప్పటికీ మూడింట రెండొంతుల మెజారిటీకి 163 మంది ఎంపీల మద్దతు అవసరం. అంటే 9 స్థానాలు తక్కువ పడతాయి. మరింత మంది తృణమూల్ రాజ్యసభ సభ్యులు రాజీనామా చేసి ఎన్డీయేలో చేరితే 163 మార్కును చేరుకోవడం సాధ్యమవుతుంది. ఈ ఏడాది నవంబర్‌లో ఉత్తర్‌ప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న 10 మంది రాజ్యసభ సభ్యుల పదవీ కాలం ముగియనుంది. అసెంబ్లీలో సమాజ్‌వాదీ పార్టీ బలం పెరిగిన నేపథ్యంలో ఆ పార్టీ కొందరు ఎంపీలను రాజ్యసభకు పంపేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఆ మేర భాజపా ఎంపీల సంఖ్య తగ్గనుంది. ఒకవేళ 2/3 మెజారిటీ సాధించినా కొన్ని నెలల మురిపెం కానుంది. మరోవైపు ఇండియా కూటమికి పెద్దల సభలో 64 మంది ఎంపీలు ఉన్నారు. డీఎంకేకు చెందిన 8 మంది, ఆప్‌నకు చెందిన ముగ్గురు ఇండియా కూటమికి దూరంగా ఉండడంతో విపక్ష కూటమి బలం తగ్గుముఖం పట్టింది. మరోవైపు వైఎస్సార్‌సీపీ 7, బీజేడీ 7, వైగోకు చెందిన ఎండీఎంకేకు ఒక ఎంపీ ఉన్నారు. కీలక బిల్లుల సమయంలో వీరు ఎటువైపైనా మొగ్గు చూపొచ్చు. లోక్‌సభలో ఇప్పట్లో కష్టమే: రాజ్యసభలో ఎన్డీయే ఎంపీల సంఖ్యా బలం పెరిగినా లోక్‌సభలో 2/3 కష్టమేనంటున్నాయి రాజకీయ వర్గాలు. తృణమూల్ నుంచి వేరుపడిన 20 మంది ఎంపీలు ఎన్డీయేకు మద్దతు తెలుపుతూ సోమ వారం లేఖ ఇవ్వనున్నారు. దీంతో ఎన్డీయే సంఖ్య బలం 314కు చేరనుంది. మూడింట రెండొంతుల బలం సాధించాలంటే 363 మంది ఎంపీల మద్దతు అవసరం.



## జడ్జి సీటు ఖాళీగా ఉందని..

తృణమూల్ కాంగ్రెస్ రెబల్ ఎంపీ కకోలీ ఘోష్ కుమారుడు డాక్టర్ బైద్యనాథ్ ఘోష్.. మాజీ సీఎం మమతా బెనర్జీ కి లీగల్ నోటీసులు పంపారు. టీఎంసీ ఎంపీలు కల్యాణ్ బెనర్జీ, సౌగతా రాయ్, మహువా మోయిత్రాలకు కూడా నోటీసులు పంపారు. బరసత్ అసెంబ్లీ స్థానంలో పోటీ చేయడానికి తాను పార్టీ టికెట్ కోరానని టీఎంసీ నేతలు చేసిన ఆరోపణలపై బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నోటీసులకు స్పందించకపోతే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. ఈ నెల మొదట్లో జరిగిన ఓ కార్యక్రమంలో మమతా బెనర్జీ మాట్లాడుతూ.. బరసత్ నుంచి ఎమ్మెల్యే టికెట్ కోసం కొంతమంది తనను సంప్రదించారని పేర్కొన్నారు. అయితే పార్టీలోని సీనియర్ నేతలు అందుకు ఒప్పుకోకపోవడంతో వారు చేసిన అభ్యర్థనను తిరస్కరించినట్లు తెలిపారు. ఒకరు ఎంపీ అయినంత మాత్రాన కుటుంబంలోని వారందరూ ఎంపీలు, ఎమ్మెల్యేలు అవ్వాలా అంటూ పరోక్షంగా కకోలీ ఘోష్‌పై విమర్శలు చేశారు. ఈ క్రమంలోనే కకోలి టీఎంసీని వీడడంతో తన కుమారుడికి టికెట్ ఇవ్వనందుకే ఎన్డీఏకు మద్దతిచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.



# మధుర పరిమళాల మనోహరం!

**ప్రకృతి ఒడిలో వికసించే పూలలో కొన్ని కేవలం అందాన్ని ఇస్తే, మరికొన్ని మధురమైన సుగంధాన్ని వెదజల్లుతాయి. కానీ, ఈ రెండింటినీ రంగరించుకున్న అద్భుతమైన తీగ మొక్క 'హనీసకల్'.**





హనీసకల్ అనగానే మనకు గుర్తొచ్చేది దాని విలక్షణమైన పూల ఆకారం. గొట్టం ఆకారంలో ఉండే ఈ పూలు గుత్తులు గుత్తులుగా పూస్తాయి. ఈ పూల అడుగు భాగంలో ఉండే మకరందం అత్యంత తీపిగా ఉండటం వల్ల దీనికి 'హనీసకల్' అనే పేరు వచ్చింది. పూలు... తెలుపు, పసుపు, ఎరుపు, పింక్ నారింజ రంగులలో విచ్చుకుంటాయి. ఈ పూల తీపి వాసన సీతాకోకచిలుకలను, తేనెటీగలను హమ్మింగ్ బర్డ్స్‌ను ఆకర్షిస్తుంది. సువాసనలు వెదజల్లే ఈ పూలలో కొన్ని రకాలు... సాయంత్రం వేళల్లో మరింత గాఢమైన సుగంధాన్ని విడుదల చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 180 రకాల జాతుల్ని కలిగిన హనీసకల్ మొక్కది వేల ఏళ్ల చరిత్ర. ప్రాచీన చైనా వైద్య శాస్త్రంలో దీన్ని కీలకంగా వాడతారు. ముఖ్యంగా శరీరాన్ని చల్లబరచడానికీ, విష పదార్థాలను బయటకు పంపడానికీ ఉపయోగిస్తారట. బ్రిటన్‌లో విక్టోరియన్ కాలంలో ఈ పూలను ప్రేమకు, విశ్వాసానికి చిహ్నంగా, పెళ్లిలో వధువు ఈ పూలను పెట్టుకోవడం శుభసూచకంగానూ భావించేవారట. అందుకేనేమో... షేక్స్‌పియర్ వంటి ప్రముఖ కవుల రచనల్లో ఈ పూల ప్రస్తావన ఎక్కువగా కనిపిస్తుంది.

**తేమ అవసరమే కానీ...**

ఈ మొక్కకు రోజుకు కనీసం 6 నుంచి 8 గంటల పాటు ఎండ అవసరం. ఎండ తక్కువైతే పూలు తక్కువగా పూస్తాయి. నీరు నిల్వ ఉండని సారవంతమైన నేలలు దీనికి అనుకూలం. ఇవి తీగ జాతి మొక్కలు కాబట్టి, పాకడానికి గోడలు, ఫెన్సింగ్ లేదా ట్రెల్లీస్ వంటి ఆధారాల్ని కల్పించాలి. మొక్క నాటిన కొత్తలో క్రమం తప్పకుండా నీరు పెట్టాలి. ఎదిగిన తర్వాత నేల పైపొర ఆరిపోయినప్పుడు మాత్రమే నీరు పోయాలి. వేర్ల దగ్గర తేమ ఉండాలి కానీ నీరు నిలిచిపోకూడదు. శీతకాలం చివరలో లేదా వసంతకాలం మొదట్లో మొక్కను కత్తిరించాలి. ఎండిపోయిన





కొమ్మలను తొలగించడం వల్ల కొత్త చిగుళ్లు వచ్చి పూలు ఎక్కువగా పూస్తాయి. ఏడాదికి రెండుసార్లు కంపోస్ట్ లేదా స్లోరిలీజింగ్ ఫెర్టిలైజర్లను అందించాలి. ఈ మొక్కకు పిండి నల్లి, తెల్లదోమ, బూజు తెగులు వంటివి వచ్చే అవకాశం ఉంది. వీటిని దూరం చేయడానికి ఫంగిసైడ్‌తో పాటు వేపనూనె పిచికారీ చేయవచ్చు. దానికంటే ముందుగా వ్యాధిసోకిన కొమ్మలు, ఆకులను కత్తిరించి దూరంగా పారేయడం మంచిది. ఈ జాగ్రత్తలతో మొక్క ఆరోగ్యంగా నిండుగా పూస్తుంది.

# చెమట పడితే మంచిదేనట!

**వేసవిలో వేడికి తట్టుకోలేక శరీరం చెమటలు పట్టడం సహజమే! అయితే ఇలా చెమటలు రావడం వల్ల చిరాగ్గా, అసౌకర్యంగా అనిపిస్తుంటుంది. దీంతో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లను ఆశ్రయిస్తుంటాం. నిజానికి శరీరం నుంచి చెమట బయటికి రాకుండా ఎప్పుడూ ఇలా చల్లటి వాతావరణంలో గడపడం కంటే.. కాస్త చెమట పట్టనివ్వడమే ఆరోగ్యకరం అంటున్నారు నిపుణులు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి..**

**వడదెబ్బ తగలకుండా..!**

ఎండాకాలంలో కాసేపు బయట గడిపినా, అధిక ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల వడదెబ్బ తగులుతుంటుంది. అయితే చెమటలు పట్టడం వల్ల వడదెబ్బ నుంచి కొంతవరకు రక్షణ పొందచ్చంటున్నారు నిపుణులు. అదెలాగంటే.. చెమట మన శరీరానికి సహజసిద్ధమైన కూలింగ్ ఏజెంట్‌లా పనిచేస్తుంది. ఎండ వేడి శరీరంలోకి వెళ్లకుండా చెమట అడ్డుపడుతుంది. తద్వారా శరీరంలో ఉష్ణోగ్రతలు పెరగకుండా జాగ్రత్తపడచ్చు. ఇక ఈ కాలంలో వడదెబ్బ నుంచి రక్షణ పొందాలంటే.. ద్రవాహారం ఎక్కువగా తీసుకోవడం, శరీరానికి చలువ చేసే పదార్థాల్ని తీసుకోవడమూ ముఖ్యమే అంటున్నారు నిపుణులు.



**రోగనిరోధక శక్తికి!**

స్వేద గ్రంథులు విడుదల చేసే చెమట రోగనిరోధక శక్తినీ పెంచుతుందని ఓ అధ్యయనంలో తేలింది. ఇందుకు స్వేద గ్రంథుల్లో ఉండే యాంటీమైక్రోబియల్ పెప్టైడ్లే కారణమట! ఇవి వ్యాధులకు కారణమయ్యే క్రిములతో పోరాడి.. సహజ రక్షణ కల్పిస్తాయి అంటున్నారు నిపుణులు.

**ఇవి కూడా!**

* వ్యాయామం చేసే క్రమంలో చెమట పడుతుంది. తద్వారా శరీరం చల్లబడడంతో పాటు ఎండార్ఫిన్లూ విడుదలవుతాయి. ఫలితంగా శారీరక నొప్పులు, ఒత్తిళ్లు తగ్గి ప్రశాంతంగా ఉండచ్చు అంటున్నారు నిపుణులు.
* శరీరం చెమట పట్టినప్పుడు చర్మ గ్రంథులు తెరుచుకుంటాయి. తద్వారా చర్మ రంధ్రాల్లో గాలి బాగా ఆడుతుంది. అలాగే శరీరంలోని మలినాలూ చెమట రూపంలో బయటికి వచ్చేస్తాయి. వీటివల్ల చర్మం ఎప్పటికప్పుడు శుభ్రపడుతుందట.

గమనిక : అయితే ఇలా చెమట పట్టడం మంచిదే అయినా.. ఎక్కువసేపు ఇలాగే ఉండడం వల్ల చర్మ ఆరోగ్యం దెబ్బతింటుంది. వాతావరణంలోని దుమ్ముధూళి చెమటతో కలిసి చర్మ రంధ్రాల్లోకి చేరడం వల్ల మొటిమలు, మచ్చలు ఏర్పడతాయి. కాబట్టి చెమట పట్టిన వెంటనే స్నానం చేయడం మంచిదంటున్నారు నిపుణులు.

# వేసవి తాపాన్ని తగ్గించే జల్ జీరా!

ఎండా కాలం వచ్చిందంటే చాలు దాహంతో అల్లాడిపోతుంటాం. ఈ సమయంలో కృత్రిమమైన కూల్ డ్రింక్స్, సోడాలను తాగే బదులు ఓ గ్లాస్ జల్ జీరా తాగి చూడండి. ఇది దాహం తీర్చడమే కాదు... మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది. ముఖ్యంగా ఇందులోని జీలకర్ర జీర్ణ రసాల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే శరీరానికి అవసరమైన ఇనుమూ అందుతుంది. పీరియడ్స్ సమయంలో వచ్చే పొత్తికడుపు నొప్పి, తిమ్మిర్ల నుంచి ఈ పానీయం ఉపశమనం కలిగిస్తుంది. ఇక, ఇందులోని నల్ల ఉప్పు... శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను అందిస్తుంది. అందుకే, ఎండలో తిరిగి ఇంటికి రాగానే ఒక గ్లాసు జల్ జీరా తాగి చూడండి. ఆ అలసట తక్షణమే మాయమవుతుంది. వేయించిన జీలకర్ర, కొద్దిగా అల్లం ముక్క, పుదీనా ఆకులు, పచ్చిమిర్చి (అవసరమైతే) కలిపి మెత్తగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని చల్లని నీటిలో కలిపి, తగినంత నల్ల ఉప్పు, ఆమ్‌చూర్ పొడి, నిమ్మరసం కలపాలి. చివరగా కొద్దిగా బూందీ చల్లుకుంటే సరి. రుచికరమైన జల్ జీరా తయారైనట్లే. సహజ సిద్ధమైన ఈ పానీయం పెయిన్ కిల్లర్‌లానూ పనిచేస్తుంది. జీవక్రియను మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా తక్కువ కెలొరీలు ఉండి, ఆకలిని నియంత్రించడంలో సహాయపడటం వల్ల బరువు తగ్గాలనుకునే మహిళలకు మంచి ఎంపిక.





# ఇలా... ప్రకృతికి చేరువగా!

**అపార్ట్‌మెంట్లలో ప్రతి చదరపు అడుగూ విలువైనదే. ఆయా గదుల్ని వినియోగం పరంగా ప్రత్యేకంగా మార్పులు చేసుకోలేం కానీ, బాల్కనీ అందుకు మినహాయింపు. అందుకే దీన్ని ఎలా తీర్చిదిద్దుతున్నామనేది ముఖ్యం. ప్రకృతికీ, పచ్చదనానికీ చేరువయ్యేందుకు ఇదో దగ్గర మార్గం. అందుకోసం ఏం చేయాలంటే...**

కాసేపు ఎండ పట్టడం, తీరిగ్గా కూర్చొని కప్పు కాఫీ తాగడం, ధ్యానం చేసుకోవడం... అన్నింటికీ ఒకటే చోటు... బాల్కనీ. చూశారా ఇది ఎంత ముఖ్యమైందో! అందుకే దీన్ని చిన్నపాటి పార్కుగా మార్చేయాలి. అప్పుడే ప్రకృతిలోకి వెళ్లాలనుకున్నప్పుడల్లా అక్కడ కాసేపు కూర్చొని సేదతీరొచ్చు.

* నిలువుగా పెరిగే మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వండి. అవి పాకేందుకు వీలుగా ఏర్పాట్లుచేయాలి. ఇవి గాలిని శుద్ధి చేస్తాయి. అలాగే ఎండ నుంచి ఉపశమనం కలిగిస్తాయి.
* తరచూ మార్చాల్సిన పనిలేకుండా ఎండలూ, వర్షాలకు తట్టుకునే మెటీరియల్‌ని అక్కడ ఉపయోగించాలి. అందుకు గట్టి కుండీలు, మెటల్‌తో చేసిన వస్తువులు ఎంచుకోవడం మేలు.
* ఇన్విజబుల్ నెట్టింగ్ బార్‌ని ఉపయోగించి పావురాలను దూరం పెట్టండి. అక్కడ కూర్చునేందుకు ప్రత్యేకంగా చిన్న సైజు కుర్చీల్ని వినియోగించండి.
* చీకటిపడ్డాక పెద్ద లైట్లు కాకుండా చిన్న సోలార్ లాంతర్లు వాడండి. వాటిని మొక్కల మధ్యన ఉంచితే ఇంకా మంచిది.



# విద్యార్థుల బాధ్యత తీసుకున్న విజయ్-రష్మిక

స్టార్ దంపతులు విజయ్ దేవరకొండ, రష్మిక మందణ్ణ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. తాము ప్రకటించినట్టుగానే సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విజయ్ తండ్రి జన్మించిన తెలంగాణలోని అచ్చంపేట మండలంలోని 9, 10వ తరగతి విద్యార్థులకు అండగా నిలుస్తున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని విజయ్ దేవరకొండ స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ మేరకు విజయ్ తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. "మా నాన్న పుట్టిన చిన్న పల్లె తుమ్మనపేటకు బయలుదేరాం. ఈ ఏడాది ఫిబ్రవరిలో నేను, రష్మిక మా ఒక చిన్న కలను ప్రకటించాం. అచ్చంపేట మండలంలోని 9, 10 తరగతుల విద్యార్థులను ప్రోత్సహించాలన్నదే మా లక్ష్యం" అని పేర్కొన్నారు. విజయ్ పోస్ట్‌ను రష్మిక రీషేర్ చేస్తూ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉదయ్‌పూర్‌లో వివాహ బంధంతో ఒక్కటైన ఈ జంట, 'దేవరకొండ ఫౌండేషన్' ద్వారా తుమ్మనపేటలోని 44 ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10వ తరగతి చదివే విద్యార్థులకు విద్యా సహాయం అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ఫీజులు చెల్లించడం, వారికి అవసరమైన నోట్‌బుక్స్, ఇతర స్టడీ మెటీరియల్‌ను అందించనున్నారు. తద్వారా తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గించడంతో పాటు ఆర్థిక కారణాలతో చదువు మధ్యలో ఆగిపోకుండా చూడాలన్నది వీరి సంకల్పం. ఇక సినిమాల విషయానికొస్తే, వివాహం తర్వాత విజయ్, రష్మిక తొలిసారిగా 'రణబాలి' అనే పీరియడ్ డ్రామా చిత్రంలో కలిసి నటిస్తున్నారు. గతంలో 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించిన ఈ జంటకు, 'రణబాలి' మూడో చిత్రం కానుంది. 1850ల నాటి చారిత్రక వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. చరిత్ర పుస్తకాల్లో నమోదుకాని, బ్రిటిష్ వారు తప్పుగా ప్రచారం చేసిన కొన్ని కీలక సంఘటనల ఆధారంగా ఈ చిత్రం కథ సాగుతుందని సమాచారం.



## అఖిల్ 'లెనిన్' విడుదల వాయిదా.. కొత్త తేదీని ప్రకటించిన నాగార్జున



అక్కినేని అఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'లెనిన్' విడుదల వాయిదా పడింది. ఈ విషయాన్ని ఆయన తండ్రి, ప్రముఖ నటుడు కింగ్ నాగార్జున అధికారికంగా ప్రకటించారు. సినిమాను జూలై 10న విడుదల చేయనున్నట్లు ఆయన తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. ఈ వాయిదాకు గల కారణాన్ని నాగార్జున స్పష్టంగా వివరించారు. "లెనిన్ చిత్రబృందం నన్ను కలిసి, సినిమాను మరింత ప్రత్యేకంగా, 100 శాతం అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు మరికొంత సమయం కావాలని కోరారు. వారిలోని అభిరుచి, స్ఫూర్తి చూసి నేను అంగీకరించాను" అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అంతేకాకుండా, సినిమాపై అంచనాలు పెంచేలా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మనోడు జూలై 10న వస్తున్నాడు. నేను మళ్ళీ చెబుతున్నా, మీరు ఒక కొత్త అఖిల్‌ను చూస్తారు! 'లెనిన్' అనుభవానికి సిద్ధంగా ఉండండి" అంటూ అభిమానుల్లో ఉత్సాహం నింపారు. నాగార్జున ప్రకటనతో సినిమా విడుదల తేదీపై నెలకొన్న ఊహాగానాలకు తెరపడింది. నాణ్యమైన చిత్రాన్ని అందించాలనే లక్ష్యంతోనే చిత్రబృందం ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది.

## 'డ్యూడ్ 2' సన్నాహాలు

'దేవదాస్ సార్..' అంటూ 'డ్యూడ్' సినిమాతో కుర్రకారుని అలరించింది మలయాళ భామ మమితా బైజు. ఆమె, హీరో ప్రదీప్ రంగనాథన్ జంటగా నటించిన చిత్రమిది. కీర్తిశ్వరన్ దర్శకత్వం వహించారు. ప్రేమ, స్నేహం లాంటి అంశాలతో రూపొందిన ఈ చిత్రంలో మమిత, ప్రదీప్‌ల జోడీ ప్రేక్షకుల్ని కట్టిపడేసింది. గతేడాది విడుదలై యువతను విశేషంగా ఆకట్టుకున్న ఈ సినిమాకి.. ఇప్పుడు సీక్వెల్‌ను తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే ఓ కార్యక్రమంలో పాల్గొన్న దర్శకుడు కీర్తిశ్వరన్ 'డ్యూడ్ 2' గురించి మాట్లాడుతూ.. "ఈ కొనసాగింపు చిత్రం గురించి ప్రదీప్ రంగనాథన్‌కు ఓ ఆలోచనను చెప్పాను. ఈ కథాలోచన అనుకున్నట్లుగా కార్యరూపం దాల్చితే.. సీక్వెల్‌ను త్వరలోనే పట్టాలెక్కిస్తాం" అని అన్నారు. ప్రస్తుతం మమిత ఖాతాలో 'విశ్వనాథ్ అండ్ సన్స్', 'ఇరందు వానం' తదితర చిత్రాలున్నాయి.

## చిదంబరంతో కలిసి మోహన్‌లాల్ మూవీ? క్లారిటీ ఇచ్చిన దర్శకుడు

'మంజుమ్మల్ బాయ్స్' దర్శకుడు చిదంబరం, ప్రముఖ నటుడు మోహన్‌లాల్తో కలిసి పనిచేయబోతున్నారన్న వార్తలు ఇటీవల బాగా ప్రచారంలోకి వచ్చాయి. దర్శకుడి తండ్రే స్వయంగా ఈ విషయాన్ని పంచుకోవడంతో, అందరూ అది ఖరారైనట్లేనని భావించారు. అయితే, ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చిదంబరం దీనిపై స్పష్టతనిచ్చారు. మోహన్‌లాల్‌తో ఏ ప్రాజెక్ట్‌పై చర్చించలేదని వెల్లడించారు. తన తండ్రి ఏదో వదంతి విని దానిని సోషల్ మీడియాలో పంచుకుని ఉండొచ్చన్నారు. సాధారణ సందర్భాల్లో మోహన్‌లాల్‌ను కలిసినప్పటికీ.. ప్రాజెక్ట్ గురించి మాత్రం చర్చ జరగలేదని చిదంబరం తెలిపారు. మోహన్‌లాల్‌తో సినిమా చేసే ఆలోచన ఏమైనా ఉందా? అని విలేకరి అడిగినప్పుడు, ''ఒకవేళ అవకాశం వస్తే.. ఆ సినిమా ప్రేక్షకులు ఆశించే అద్భుతమైన సన్నివేశాలతో కూడిన వినోదాత్మక చిత్రంగా ఉంటుంది'' అని ఆయన బదులిచ్చారు. ఇక చిదంబరం 'బాలన్' అనే తదుపరి చిత్రంతో త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. మోహన్‌లాల్ చివరిగా 'దృశ్యం 3'లో ప్రధాన పాత్ర పోషించిన విషయం తెలిసిందే.





## 'కాంచన 4'లో నయన్?



ఈ ఏడాది ప్రారంభంలోనే 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రంతో 'మీసాల పిల్లా' అంటూ కుర్రకారుని పాటలు పాడుకునేలా చేసింది అగ్రకథానాయిక నయనతార. ప్రస్తుతం భాషతో సంబంధం లేకుండా 'హాయ్', 'టాక్సిక్', 'డియర్ స్టూడెంట్స్' లాంటి వరుస ప్రాజెక్టులతో తీరిక లేకుండా గడుపుతోందీ భామ. ఇప్పుడీమె ఖాతాలోకి మరో చిత్రం చేరినట్లు తెలుస్తోంది. రాఘవ లారెన్స్ ప్రధాన పాత్రలో నటిస్తూ.. తెరకెక్కిస్తున్న చిత్రం 'కాంచన 4'. ఈ హారర్ కామెడీలో ఓ ప్రత్యేక పాత్రలో నయన్ మెరవనున్నట్లు సమాచారం. ఈ సినిమాలోని ఫ్లాష్‌బ్యాక్‌కు సంబంధించిన కీలక సన్నివేశాల్లో ఆమె కనిపించనున్నట్లు తమిళ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 'కాంచన' ఫ్రాంచైజీలో రాబోతున్న ఈ చిత్రంలో పూజా హెగ్డే, నోరా ఫతేహి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## 'కాక్‌టెయిల్ 2' ఈవెంట్ క్రౌడ్ మేనేజ్‌మెంట్‌లో కృతి సెన్సేషన్!

హోమి అడజానియా దర్శకత్వంలో బాలీవుడ్ నటుడు షాహిద్ కపూర్, తారలు కృతి సనన్, రష్మిక నటిస్తున్న చిత్రం 'కాక్‌టెయిల్ 2'. మడాక్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న మూవీ జూన్ 19న థియేటర్లలోకి రాబోతుంది. సినిమా ప్రచారాల్లో భాగంగా పుణెలో జరిగిన ఒక సంఘటన తాజాగా నెట్టింట వైరల్ అయింది. చిత్ర ప్రచారయాత్రలో భాగంగా ముగ్గురు నటీనటులు శనివారం పుణెలోని ఓ మాల్‌ను సందర్శించారు. వారిని చూసేందుకు అభిమానులు బారికేడ్లను దాటి రావడంతో తొక్కిసలాట వాతావరణం నెలకొంది. దీంతో నిర్వాహకులు కార్యక్రమాన్ని కొద్దిసేపు నిలిపేశారు. ఈ గందరగోళంలో షాహిద్ అసహనానికి గురయ్యారు. భద్రతా సిబ్బంది వారిని బయటకు తీసుకెళ్తుండగా.. మరోవైపు కృతి మాత్రం రష్మికను అభిమానుల తాకిడి నుంచి తప్పించారు. ఆ దృశ్యాలు ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అయ్యాయి. దీంతో నెటిజన్లు కృతిపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఆమె రష్మికను సోదరిలా కాపాడిందంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.మరోవైపు, ఈ ఘటనపై పలువురు నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది నటీమణులకు భయానక అనుభవమని.. ప్రాంగణంలో నిర్వహణ లోపాలు, అభిమానుల తీరు బాగోలేదంటూ పోస్టులు పెట్టారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.